




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 122 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | సోమవారం - 22 - జూన్ - 2026 | వెల రూ. 5 /-


# ముగిసిన నీట్ రీ ఎగ్జామ్




- ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 పునఃపరీక్ష
- ఫిజిక్స్ కఠినంగా, బయాలజీ సులభంగా ఉందన్న విద్యార్థులు
- దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు
- జూన్ 28 నాటికి అధికారిక ఆన్సర్ కీ విడుదల అంచనా
- జూలై చివరి వారంలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశం

## ఇక అందరి దృష్టి ఫలితాలపై..!




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించారు. దివ్యాంగులకు 6.20 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. భారత్‌తో పాటు రి యాద్ లోని అంతర్జాతీయ కేంద్రంలో..

2

# ముంబైలో మళ్లీ కరోనా కలకలం!

- ముంబైలో విజృంభిస్తున్న కోవిడ్, స్వైన్ ఫ్లూ కేసులు
- రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదల
- తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు
- యాంటీబయాటిక్స్ వాడొద్దని, జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

**నేటి శుభోదయ, ముంబై :** రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ (H1N1), ఇన్‌ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది..

2




# నీట్ విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని...

## ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ గంట సేపు వెయిటింగ్!

- నేడు దేశవ్యాప్తంగా నీట్ రీ ఎగ్జామ్
- నీట్ విద్యార్థుల కోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయిన ప్రధాని మోదీ
- ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం
- పరీక్ష ప్రారంభమయ్యాకే తన నివాసానికి బయలుదేరిన వైనం
- దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా హాజరవుతున్న నీట్ రీ-ఎగ్జామ్
- భయం లేకుండా పరీక్ష రాయాలని విద్యార్థులకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సూచన




**నేటి శుభోదయ, ముంబై :** ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థుల పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను మరోసారి చాటుకున్నారు. నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ రాసే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఆయన ఢిల్లీ విమానాశ్రయంలోనే ...

2

# బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు..

## రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు



- సోమవారం బసవతారకం ఆసుపత్రి రజతోత్సవాలు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఏపీ సీఎం చంద్రబాబు
- 25 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు నిరంతర సేవలు
- ఎన్టీఆర్ ఆశయాలను ఛైర్మన్‌గా కొనసాగిస్తున్న బాలకృష్ణ

2

# రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు

## - ఒకేసారి మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ..

- కోల్‌కతాలో మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ
- దూనగిరి, సంశోధక్, అగ్రే నౌకలతో పెరగనున్న నావికాదళ సామర్థ్యం
- రక్షణ రంగంలో భారత్ కొనుగోలుదారుగా ఉండబోదని స్పష్టం చేసిన ప్రధాని
- సముద్ర శక్తి బలంగా ఉన్న దేశమే ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఎదుగుతుందని వ్యాఖ్య
- యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక సామర్థ్యాలను పెంచనున్న కొత్త నౌకలు

2



# నీట్ విద్యార్థులకు టీఎస్ఆర్టీసీ బాసట

## - పరీక్షకు ఉచిత బస్సు ప్రయాణం సక్సెస్!



- రీ-నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం
- వేలాది మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని మంత్రి వెల్లడి
- ఇది విద్యార్థుల సంక్షేమానికి నిదర్శనమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకున్న నిర్ణయమని ప్రశంస

2

# మరింత తీవ్రంగా దాడి చేస్తాం..

## - ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్

- లెబనాన్‌లోని అనుకూల గ్రూపులను అదుపు చేయాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- లేదంటే గత వారం కంటే తీవ్రమైన దాడులు తప్పవని స్పష్టం
- ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం
- చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమం, కాల్పుల విరమణపై దృష్టి
- ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య ఘర్షణలతో ఒప్పందం అమలులో సవాళ్లు

2



# ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు..

## - డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్



- కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు
- షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా
- డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు
- నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా కాలిపోయిన బస్సు

**నేటి శుభోదయ, కకరీంనగర్:** కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయట..

2

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం

## - సింగరేణి యాజమాన్యం

- రూ.1,600 కోట్ల బొగ్గు కుంభకోణం ఆరోపణలను ఖండించిన సింగరేణి
- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో పూర్తి పారదర్శకత ఉందని స్పష్టం
- 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో నిజం లేదని ప్రకటన
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖతో తెరపైకి వచ్చిన బొగ్గు గల్లంతు ఆరోపణలు

**నేటి శుభోదయ, సింగరేణి:** సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది.

## ముంబైలో మళ్లీ కరోనా కలకలం!

మొదటిపేజీ తరువాయి..
**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## నీట్ విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ గంట సేపు వెయిటింగ్!

మొదటిపేజీ తరువాయి..
దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆదివారం మధ్యాహ్నం 1:15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన నేరుగా తన అధికారిక నివాసానికి వెళ్లాల్సి ఉంది. అయితే, మధ్యాహ్నం 2 గంటలకు దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రారంభం కానుండటంతో, తన కాన్వాయ్ కారణంగా రోడ్లపై ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు ఇబ్బంది పడతారని ప్రధాని భావించారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ఆయన విమానాశ్రయం నుంచి బయటకు రాకుండా అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత, అంటే మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ఆయన తన నివాసానికి బయలుదేరారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కట్టుదిట్టమైన భద్రత నడుమ నీట్ రీ–ఎగ్జామ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఆందోళన, భయం లేకుండా పరీక్ష రాయాలని సూచించారు. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, యువత భవిష్యత్తుతో ఆడుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు..

**- రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు**

మొదటిపేజీ తరువాయి..
**నేటి శుభోదయ, హైదరాబాద్ :** క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన అర్ధాంగి బసవతారకం జ్ఞాపకార్థం, ఆమె చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ చికిత్స సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 1988లో ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య నిపుణులు, దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకలతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు విస్తరిస్తూ నేడు 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే సమగ్ర క్యాన్సర్ చికిత్సాలయంగా పేరు పొందింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాలకృష్ణ ఛైర్మన్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తండ్రి ఆశయాన్ని పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లకు, 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో 65 శాతానికి పైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే ఉండటం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా కూడా వేలాది మందికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇప్పటివరకు 8 వేలకు పైగా విజయవంతమైన క్యాన్సర్ సర్జరీలు, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలు ఇక్కడ నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అత్యాధునిక సదుపాయాలున్న మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ వంటి విభాగాల్లో సుమారు 250 మంది నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు. సోమవారం జరగనున్న రజతోత్సవ వేడుకలకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరై ఆసుపత్రి 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని స్మరించుకోనున్నారు.

## ముగిసిన నీట్ రీ ఎగ్జామ్.. ఇక అందరి దృష్టి ఫలితాలపై..!

మొదటిపేజీ తరువాయి..
కూడా పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. కాగా, ఎప్పట్లాగానే పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తమను లోపలికి అనుమతించకపోవడం కన్నీటి పర్యంతం కావడం కనిపించింది. పరీక్ష రాసిన విద్యార్థుల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం, ఈసారి ప్రశ్నపత్రం మొత్తం మీద మధ్యస్థంగా ఉంది. అన్ని విభాగాల్లోకెల్లా ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉందని, ఆ తర్వాత కెమిస్ట్రీ ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే, బయాలజీ విభాగం మాత్రం చాలా సులభంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష ముగియడంతో, వివిధ కోచింగ్ సంస్థలు త్వరలోనే అనధికారిక ఆన్సర్ కీలను విడుదల చేయనున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారిక ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 28 నాటికి విడుదల చేసే అవకాశం ఉంది. దీనిపై అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత తుది కీని, ఫలితాలను ప్రకటిస్తారు. నీట్ యూజీ 2026 ఫలితాలను జూలై చివరి నాటికి వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమ స్కోర్‌కార్డులను అధికారిక వెబ్‌సైట్ neet.nta.nic.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 2026లో జరిగిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి ఈ పునఃపరీక్షను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను గమనించాలని అధికారులు సూచించారు.

## రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు

**ఒకేసారి మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ..**

**నేటి శుభోదయ, కోల్‌కతా :** భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే' లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "రక్షణ రంగంలో భారత్ ఇకపై కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోదు. మన సైనిక శక్తి ప్రపంచానికి మార్కెట్‌గా మారకూడదు. మన బలానికి నిర్వచనం ప్రపంచానికి మార్కెట్‌గా మారడంలో లేదు, మన స్వావలంబనలోనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని, ఇదే నవ భారతానికి ఉన్న అతిపెద్ద బలమని ప్రధాని అన్నారు. కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు. "ఏ దేశానికైతే బలమైన సముద్ర శక్తి ఉంటుందో, ఆ దేశానికి బలమైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవాన్ని భారత్ బాగా అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతోంది," అని మోదీ తెలిపారు.

## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్

మొదటిపేజీ తరువాయి..
పడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.



## మరింత తీవ్రంగా దాడి చేస్తాం...

**- ఇరాన్ కు ట్రంప్ మరోసారి వార్నింగ్**

**నేటి శుభోదయ :** ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో కీలక చర్చలు జరుగుతుండగానే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపుల కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని, లేదంటే గత వారం కంటే మరింత తీవ్రమైన సైనిక చర్య తప్పదని ఆదివారం స్పష్టం చేశారు.ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "లెబనాన్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్న తమ ప్రాక్సీ గ్రూపులను ఇరాన్ వెంటనే ఆపాలి. అలా చేయని పక్షంలో, మేం గత వారం కంటే ఈసారి చాలా గట్టిగా ఇరాన్‌పై దాడి చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు, లెబనాన్ సహా ఇతర ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు చేరుకున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఈ నెల ప్రారంభంలో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అణు అంశాలు, హోర్ముజ్ జలసంధి, లెబనాన్‌తో సహా పలు ప్రాంతాల్లో కాల్పుల విరమణపై 60 రోజుల పాటు చర్చలు జరపాలని ఇందులో నిర్ణయించారు. అయితే, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు, హిజ్బుల్లా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగడంతో స్విస్ చర్చలు ఆలస్యమయ్యాయి.

## నీట్ విద్యార్థులకు టీఎస్ఆర్టీసీ బాసట

**- పరీక్షకు ఉచిత బస్సు ప్రయాణం సక్సెస్!**

**నేటి శుభోదయ :** రీ–నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. నీట్ విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



# మిర్యాలగూడ త్రిపుల్ మర్డర్ మిస్టరీ ఛేదించిన పోలీసులు

**హైదరాబాద్, నల్గొండ, నేటి శుభోదయ :** మంటల్లో కాలిపోయింది ఇల్లు కాదు. బయటపడింది హంతకుడి పథకం.ప్రమాదంలా కనిపించిన ఘటన వెనుక పగ, ప్రతీకారం, ప్రణాళిక ఉంది అనే నిజం బయటపడింది. సాంకేతిక ఆధారాలతో కిల్లర్‌ను ట్రేస్ చేసిన స్పెషల్ టీమ్. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ అరెస్ట్ చేశారు. మ్యాట్రిమోనీ పరిచయం, ప్రేమ, పెళ్లి, చివరకు రక్తచరిత్ర సృష్టించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ధనలక్ష్మి పై పెంచుకున్న కక్షతో ఘోరానికి పాల్పడినట్లు పోలీసుల నిర్ధారణ తేలింది. నేరానికి ముందు కొన్ని రోజుల పాటు రెక్కీ చేసిన నిందితుడు. యాక్టివా స్కూటీ దొంగిలించి మిర్యాలగూడకు చేరుకున్న కిల్లర్.మార్గమధ్యంలో పెట్రోల్ క్యాన్ కొనుగోలు చేసి అమలు చేసిన మాస్టర్ ప్లాన్.అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న వారిపై పెట్రోల్ చల్లిన నిందితుడు.ఒక్క అగ్గిపుల్లతో మూడు ప్రాణాలను బలిగొన్న దారుణం.మంటలు తనకూ అంటుకున్నా పరారైన నిందితుడు.ఇంట్లో లేని ధనలక్ష్మి ప్రాణాలతో బయటపడగా, వనం చంద్రమ్మ (48), లక్ష్మణ్ (17), ప్రణతి (15) సజీవ దహనం అయ్యారు. కాలిపోయిన ఇంటి వెనుక దొరికిన బకెట్‌తో కేసులో కీలక మలుపు తిరిగింది. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ మార్గాలు నిందితుడిని పట్టించాయి.నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్,




కాలిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షణలో కేసు ఛేదనడీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు. మిర్యాలగూడ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కీలక పాత్ర పోషించారు. హెడ్ కానిస్టేబుళ్లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లకు ఎస్పీ ప్రశంసలుకేసును ఛేదించిన బృందానికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు ప్రకటించిన ఎస్పీ.

# సదాశివపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**సంగారెడ్డి, నేటి శుభోదయ :** సదాశివపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సదాశివపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శివరాజ్ పాటిల్ హాజరై యోగా ప్రాధాన్యతపై ప్రసంగించారు.ఈ సందర్భంగా యోగా సాధకులు, క్రీడాకారులకు యోగా మ్యాట్లను అందజేసి వారిని అభినందించారు. అనంతరం యోగా అభిమానులతో కలిసి వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించి యోగాభ్యాసంలో పాల్గొన్నారు.శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ, నేటి సమాజంలో ప్రతి వ్యక్తి నిత్యజీవితంలో అనేక రకాల పనులు, బాధ్యతల కారణంగా ఒత్తిడికి గురవుతున్నారని, అలాంటి పరిస్థితుల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగ ఎంతో అవసరమని తెలిపారు. మన పూర్వీకులు అందించిన ఈ అమూల్యమైన యోగా సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకుని,




ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు మదన్ మోహన్ గౌడ్, స్థానిక నాయకులు విజయ్ కుమార్, రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు కలాలి శ్రీనివాస్ గౌడ్, మన్సూర్ అహ్మద్, బాలు ఆర్ట్స్ అంబదాస్, ముజీబ్ మాస్టర్, శేఖర్, అశోక్, శ్రీనివాస్, సూర్య మోహన్, మన్నె మహేష్, చిన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.యోగ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాభ్యాసాన్ని అలవాటు చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు.

# 27న "స్వరసుధ" సామజవరగమన

**ఖమ్మం, నేటి శుభోదయ :** స్వరసుధ మ్యూజిక్ యూనిట్ 35 వ వార్షికోత్సవం సందర్భంగా సామజ వరగమన శీర్షికన మెగా సినీ గీతాల కార్యక్రమాన్ని ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు కొమర్రాజు మాధవరావు తెలిపారు.విజయవాడకు చెందిన రవి,స్వర సుధ సంగీత బృందంచే లైవ్ ఆర్కెస్ట్రా పై ప్రముఖ గాయనీగాయకులు తమ పాటలతో అలరించబోతున్నారని,హిందోళ రాగంతో కూడిన గాన మాలిక ప్రత్యేక ఆకర్షణగా రూపొందించినట్లు పేర్కొన్నారు.

**– నలభై వసంతాల కళా మాధవుడు**

స్వరసుధ మాధవరావు నలభై ఏళ్లుగా ఖమ్మం కళారంగంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి కళా సేవలో పునీతులవుతున్నారు.తొలుత మృదంగ వాయిద్యకారునిగా గుర్తింపు పొందిన ఆయన ఆకాశవాణి గాయకునిగా కూడా నమోదయ్యారు.కీ బోర్డ్ ప్లేయర్ గా రాణిస్తూ మ్యూజిక్ డైరక్టర్ గా గుర్తింపు తెచ్చుకున్నారు. తొంభైవ దశకంలో పేద కళాకారుల సహాయ సమితి అధ్యక్షునిగా వ్యవహరించి మూడేళ్లపాటు భారీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు.అనంతరం స్వరమంజరి పేరుతో ఏర్పడిన సంగీత సంస్థ అధ్యక్షునిగా కొన్నేళ్లపాటు సినీ గీతామృతాలను ప్రేక్షకులకు అందించారు. బాలకామేశ్వరరావు,సాయి జగద్ధాత్రి, గౌతమ్,రేవతి,సుధారాణి,భారతి,సత్యవాణి వంటి ప్రముఖ గాయకులతో సంగీత కార్యక్రమాలను నిర్వహించి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు.తదనంతరం స్వరసుధ కల్చరల్ యూనిట్ ను స్థాపించి ప్రతి ఏటా వినూత్న రీతిలో ఈవెంట్లు చేస్తున్నారు. నలభై ఏళ్లుగా కళామతల్లి సేవలో బహు పాత్రలు పోషిస్తోన్న మాధవ



రావు సారధ్యంలో ఈనెల 27 న స్వరసుధ వార్షికోత్సవ వేడుక నిర్వహణకు సమాయత్తమయ్యారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కళాభిమానులను కోరారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటి శుభోదయ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలం పట్టణంలోని తెలంగాణ టూరిజం హోటల్‌లో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువు శ్రీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో యోగా ఆసనాలు, ప్రాణాయామ సాధనలను నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యోగా సాధకులు ఉత్సాహంగా పాల్గొని యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యోగా భార





తదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, ముత్యాల శ్రీనివాస్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, బోడ సత్యనారాయణ, ముత్యాల చంద్రశేఖర్, చెల్లుబోయిన వెంకన్న, ములిశెట్టి నిఖిల్, హరీష్, పానీపూరి శ్రీను, పాండురంగాచారి, షేర్ శ్రీను పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజావాణి రద్దు



**ఖమ్మం, నేటి శుభోదయ :** జిల్లాలో ఈ నెల 30న జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం ఖమ్మం జిల్లాకు రానున్న నేపథ్యంలో, (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజా వాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల పరిశీలన, సమీక్ష కోసం ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేపడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం మొత్తం ఏర్పాట్లలో నిమగ్నమై ఉండనున్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ ఒక్క రోజు మాత్రమే రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, తమ సమస్యలు, వినతిపత్రాల సమర్పణ కోసం సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు



**చింతకాని, నేటి శుభోదయ :** చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు హాజరై " ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ "చిత్రపటానికి పూలదండవేసి కొబ్బరికాయ కొట్టి, పూలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ప్రజా సేవలో నిమగ్నమవ్వాలని తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, అంగన్వాడీ టీచర్స్ నాగ సీతారత్నం, చాపల మడుగు దీపిక, వార్డు సభ్యులు మధు, విజయ, అరుణ,రేషన్ డీలర్ బండి యాకోబు, బండి సైదులు, మరీదు మధు,మరీదు రామ్, మడిపల్లి మంగరావు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

**- జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఎం. పరంధామరెడ్డి**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటి శుభోదయ :** జిల్లా ఎన్‌సీసీ యూనిట్ మరియు జిల్లా యువజన, క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాల్వంచ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది యువత, క్రీడాకారులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు.ఈ కార్యక్రమంలో యోగా నిపుణుల ఆధ్వర్యంలో వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యాన ప్రక్రియలను నిర్వహించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని, ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పాల్గొన్న వారికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి ఎం. పరంధామరెడ్డి మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని అన్నారు.ఎన్‌సీసీ జిల్లా కో–ఆర్డినేటర్, టిటిడబ్ల్యూఆర్‌జేసీ కొత్తగూడెం ప్రిన్సిపాల్ శ్రీమతి అనురాధ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని పేర్కొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాధాన్యత మరింత పెరిగిందని, యోగాను క్రమం తప్పకుండా ఆచరించడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు.కార్యక్రమానికి హాజరైన ఎన్‌సీసీ 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఎస్.కె. భద్రా మాట్లాడుతూ యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతిరోజూ ఆచరించాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవరుచుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిటిడబ్ల్యూఆర్‌జేసీ కొత్తగూడెం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ, డీఏవీ నవభారత్, ఓబీపీఎస్, కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్, సింగరేణి విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కేటీపీఎస్, ఏడీఈ, ఎన్‌సీసీ అధికారులు, వైద్య నిపుణులు, క్రీడా కోచ్‌లు కళ్యాణ్, డేనియల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రపంచ యోగా దినోత్సవం



**నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ :** ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ఈరోజు సిరికొండ మండల కేంద్రంలో యోగ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొని యోగాసనాలు చేశారు.ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న కట్టజి లింబాద్రి గారు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వర్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని.యోగతో ఆరోగ్యం ఆరోగ్యంతో పాటు ఆనందం" దొరుకుతాయని తెలిపారు

# రాజి మార్గమే రాజ మార్గం

## - జడ్జి స్వరూప కాటం




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటి శుభోదయ :** ఇల్లందు కోర్టు నందు శనివారం మండలా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ కక్షిదారులు గ్రామస్థాయిలో క్షణికావేశలకు వెళ్లకుండా సామరస్యంగా జీవనం గడపాలని, ఆదర్శ జీవితం గడపాలని, విలువైన సమయాన్ని డబ్బును వృధా చేసుకోకుండా పంతాలకు పోకుండా క్షణికావేశంలో పెట్టుకున్న రాజీ పడదగిన కేసులు ఇరుపక్షాలు సమన్వయంతో కోర్టుకి వచ్చి రాజి కుదుర్చుకొని ఈ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపినారు. ఈ నిర్వహించిన గృహింస కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ ధావాలు,బ్యాంకు కేసులు, అన్ని కలిపి మొత్తం 807 కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కే. యం. డి కాసిం, సీనియర్ న్యాయవాదులు, ఎన్. మల్లికార్జునరావు, పి. బాలకృష్ణ, దంతాల ఆనంద్, పెద్దూరి వెంకట నరసయ్య, జూనియర్ న్యాయవాదులు కే. ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తిక్, కోర్టు సూపరెంటెంట్ శ్రీరంగం రామకృష్ణ, కోర్టు సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిరికొండ నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక



**నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ :** మండల కేంద్రంలోని సిరికొండ గ్రామ అభివృద్ధి కమిటీ (VDC) భవనంలో ఆదివారం గ్రామస్తుల సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సిరికొండ నూతన గ్రామ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్దే ధ్యేయంగా, అందరి సహకారంతో రాబోయే రోజుల్లో కమిటీని ముందుకు తీసుకెళ్తామని నూతనంగా ఎన్నికైన ప్రతినిధుల పేర్లు ఈ సందర్భంగా ప్రకటించారుఅధ్యక్షులు: దేగం సాయిలుఉపాధ్యక్షులు: పారుపల్లి శివకార్యదర్శి: చిట్యాల రాజన్నక్యాషియర్: అంగూరి రాజా గణేష్ గౌడ్రైటర్: నరసింహారావుసలహాదారులు: తాళ్ల శ్రీనివాస్, దాసు కమిటీ సభ్యులుగా..ప్రవీణ్, గంగాధర్, చింతకింది రాజన్న, రవి, రాజులతో పాటు మరికొంతమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దేగం సాయిలు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని సమస్య లను రాజకీయాలకు అతీతంగా గ్రామఅభివృద్ధి కోసమే నూతన కమిటీ పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి అందించిన ఆధ్యాత్మిక సంపదల్లో యోగా ఒకటి

- యోగాతో మందులు లేని వైద్యం
- ప్రధాని నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారు
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్




**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ :** భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక సంపదల్లో యోగా ఒకటని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....యోగాతో కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా మనిషి వ్యక్తిత్వం,ఆలోచన విధానం, సమాజం, ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా బలపరుస్తుందన్నారు.ఆధునిక కాలంలో చాలామంది యోగా అంటే కేవలం ఆసనాలు వేయడం,బరువు తగ్గడం,ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అని భావిస్తున్నారని తెలిపారు.కానీ మనిషి శరీరం,మనసు,ఆత్మ మధ్య సమన్వయాన్ని సాధించడమే యోగా అసలు లక్ష్యమని పేర్కొన్నారు. మనిషి సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నాడని,ఒత్తిడి,ఆందోళన పెరుగుతున్నాయన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో యోగా ఔషధంలా పనిచేస్తుందని వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారని,ఐక్యరాజ్యసమితి వేదికపై 2014 సెప్టెంబర్ 27న యోగాను అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించాలని ప్రతిపాదించాలని గుర్తు చేశారు.డిసెంబర్ 11న..177 దేశాల మద్దతుతో జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.యోగాకు కులం,మతం,ప్రాంతం అనే భేదాలు లేవని ప్రతి మనిషి ఆరోగ్యం,శాంతి కోసం రూపొందించిన జీవన విధానమని చెప్పారు.అనంతరం ఆయా శాఖల అధికారులు,సిబ్బంది,విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.విద్యార్థులు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో ఆయుష్ శాఖ ఆఫీసర్ గంగాదాస్,మేరా యువ భారత్ సమన్వయకర్త రమేష్,డివైఎస్ఓ పవన్ కుమార్,యోగా గురువులు ప్రభాకర్,సిద్ది రాములు,రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో....అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రతిరోజు కొన్ని నిమిషాల యోగా..జీవితానికి ఎన్నో సంవత్సరాల ఆరోగ్యాన్నిస్తుందన్నారు.యోగ కేవలం వ్యాయామం కాదని,జీవితం ఎలా గడపాలో నేర్పే విజ్ఞానం అన్నారు.కార్యక్రమంలో ఆర్య సమాజ్ అధ్యక్షులు మహంకాళి విజయ్,ఉపాధ్యక్షులు రాజులు,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,ప్రసన్న,బీజేపీ కార్పొరేటర్ జ్యోతి మురళి,సీనియర్ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్,కృష్ణ మారావార్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనే నిజమైన నివాళి

## - ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ :** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం 'తెలంగాణ భవన్'లో ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి తాతా మధుసూదన్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

**ఉద్యమానికి సిద్ధాంత బలం**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కొనియాడారు. ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, మార్గదర్శకత్వం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయని పేర్కొన్నారు.

**ఆనాడే కేసీఆర్ పై జయశంకర్ విశ్వాసం**

ఈ సందర్భంగా 2002లో ప్రొఫెసర్ జయశంకర్ ఇచ్చిన ఒక ఇంటర్వ్యూను ఆయన గుర్తు చేశారు. "కేసీఆర్ నాయకత్వంతోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమవుతుంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగల ఏకైక నాయకుడు కేసీఆర్" అని జయశంకర్ ఆనాడే వ్యక్తం చేసిన విశ్వాసాన్ని ప్రస్తావించారు.


**కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష**

జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి మరియు ఆత్మగౌరవ పరిరక్షణ ఒక్క కేసీఆర్ నాయకత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

**తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుందాం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా కొన్ని శక్తులు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వం, స్వాభిమానం, అభివృద్ధిని కాపాడుకోవడానికి ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ కి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు."ప్రొఫెసర్ జయశంకర్ కలల తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించడం ప్రతి తెలంగాణ వాది బాధ్యత. ఆయన ఆశయాల సాధన కోసం పునరంకితం కావడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి."అని తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, బిచ్చాల తిరుమల రావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, గుండ్లపల్లి శేషగిరిరావు, బురాన్, ఆసిఫ్, తీగల సతీష్, దరిపెల్లి వీరబాబు, ఈదుల రాజేష్, షేక్ నాగుల మీరా, గాజుల రవి, నాయకులు యలమద్ది రవి, బలుసు మురళీకృష్ణ, సద్దాం షేక్, షేక్ షకీనా, మహమ్మద్ రఫీ, ఇంటి మాధవి, మహమ్మద్ మోసిన్, పోలిపాంగు వెంకట్, పిట్టల తిరుమల్, షారుక్ అర్ఫత్, షేక్ ఉస్మాన్, ఆరెంపుల వీరభద్రం, బోజెడ్ల రాంమోహన్ రావు, మద్దెల విజయ్, మంకెన రమేష్, చీకటి రాంబాబు, పటేటి సాయి, బోడా మంచా నాయక్, షేక్ చాంద్ పాషా, తదితర నాయకులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి నివాళులర్పించారు.

# పోడు వ్యవసాయం చేసుకునే గిరిజన, పేద గిరిజనేతర రైతులను ఆదుకోవాలి - సీపీఎం డిమాండ్



**కొణిజర్ల, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులు, పేద గిరిజనేతర రైతులకు కూడా అవకాశం కల్పించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవడానికి పట్టాదారు పాస్ పుస్తకం, అటవీ హక్కు పత్రం తప్పనిసరి చేయడం వల్ల దశాబ్దాలుగా పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న వేలాది మంది గిరిజన, గిరిజనేతర పేద రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూర్, కామేపల్లి, జూలూరుపాడు మండలాలతో పాటు ఖమ్మం నియోజక వర్గంలోని రఘునాథపాలెం, సత్తుపల్లి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో రైతులు పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. వీరిలో చాలామందికి ఇప్పటికీ హక్కు పత్రాలు అందలేదని పేర్కొన్నారు.ప్రభుత్వం గతంలో గిరిజనులకు కొంతమేరకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేసినప్పటికీ, ఇంకా అనేక మంది అర్హులైన గిరిజనులకు హక్కులు లభించలేదని, గిరిజనేతర పేద రైతుల సమస్యలు మరింత క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం యాప్‌లో అధికారిక భూ రికార్డులు ఉన్న రైతులకు మాత్రమే నమోదు అవకాశం కల్పించడం వల్ల ఈ రైతులు యూరియా పొందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు టోల్ ఫ్రీ నంబర్ ద్వారా బుకింగ్ అవకాశం కల్పించినట్లే, పట్టాలు లేని పోడు రైతులకు కూడా స్థానిక వ్యవసాయ అధికారుల ధృవీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా ప్రత్యేక లాగిన్ లేదా ప్రత్యామ్నాయ విధానం ద్వారా యూరియా అందించేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాకాలం ప్రారంభమై సాగు పనులు ఊపందుకుంటున్న నేపథ్యంలో ఎరువుల కొరత లేదా కృత్రిమ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర పేద రైతులందరికీ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోడు రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# రెజొనెన్స్ శ్రీనగర్ లో అంతర్జాతీయ యోగా డే



**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల శ్రీనగర్ కాలనీ రెజొనెన్స్ స్కూల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ఆసనాలు విద్యార్థుల కోలాహలంతో యోగా డేను ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది.పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు పాల్గొని మాట్లాడుతూ 21 నుండి ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా డే ను నిర్వహించు కుంటున్నామంటూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ ఏవిధంగా మెరుగు పరుచుకోవచ్చో విపులంగా చెబుతూ యోగా అనేది 5000 సంవత్సరాల నుండి భారత దేశంలో ఉన్న జ్ఞానము యొక్క అంతర్భాగం అంటూ యోగా మతంనకు సంబంధించినది కాదు ఇది ఒక జీవన విధానం మనిషి యొక్క అంతర్గత శక్తులను నియంత్రించుకుంటూ ఆనందం, ఆరోగ్యంతో జీవించడం. నిజానికి మానవుని యొక్క అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తి కలయిక. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటే పరిపూర్ణ జీవనసార విధానం అని విద్యార్థులకు యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా వలన ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిస్పృహలను దూరం చేసి మానసిక, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తుందంటూ రెజొనెన్స్ శ్రీనగర్ యోగా టీచర్తో యోగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ అంతర్జాతీయ యోగా డే శుభాకాంక్షలు తెలియజేసారు.పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా, మంచి ఆహారపు అలవాట్లను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం జీవిస్తూ ఉన్నత స్థాయిని అదిరోహించవచ్చని మరియు యోగాసనాలు శరీరానికి ఆరోగ్యాన్ని మంచి ఆకారాన్ని ధృఢత్వాన్ని, శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైనా, చిన్నవారైనా ఆసనాలు వేయటానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనుక ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుందని, అనతి కాలంలోనే యోగాని ప్రపంచమంతా గుర్తించి సంవత్సరంలో ఒక రోజును కేటాయించటం చాలా సంతోషం. ప్రతిరోజూ యోగా చేయటం వలన పిల్లలు, పెద్దలు అందరూ ఆరోగ్యవంతమైన జీవితం జీవిస్తారని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.వి.ఆర్. మురళీమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో మేలు

## - కోడూరి రమేష్



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నంమండల,తూలేకలాన్(పేత్తూల్ల) గ్రామానికి చెందిన అచ్చన బాషా 60000 రూపాయలు మరియు కోడూరి అఖిల 35000 రూపాయలు,బత్తుల చెంద్ర శేఖర్ 28000 రూపాయలు,కోడూరి శంకర్ 9000 రూపాయలు,సమా దానమ్మకు 60000 రూపాయలు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా కోడూరి రమేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సీఎం సహాయ నిధులు ఎల్ ఓ సిలు ఇస్తూ పేదలకు అండగా వుంటున్నారు అని అదే విదంగా గ్రామాలను పట్టణలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పర్టీ సీనియర్ నాయకులు శశాంక్ రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ మక్కా పెల్లి అంజయ్య గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు బండి సంతోష వెంకటేష్ కలకొండ కృష్ణ బండ శ్రీశైలం బోడ మహేందర్ ఎడ్ల కిషన్ రెడ్డి బోడ నర్సింహా సమా తిరుమల్ రెడ్డి పూజారి యాదగిరి జక్కుల మల్లేష్ దయ్యాలా కుమార్ దాచపెల్లి సాయి కుమార్ రాము పెండ్యాల గణేష్ కలకొండ శివ కలకొండ అంజయ్య గారు పాల్గొన్నారు.

# బోడేపూడి వైద్య శిబిరం విజయవంతం

## - ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి



**ఖమ్మం, వైరా, నేటి శుభోదయ :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి అన్నారు. స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపూడి వేంకటేశ్వర రావు భవనంలో ప్రతి నెల మూడవ ఆదివారం నిర్వహించే బోడేపూడి వైద్య శిబిరాన్ని 131వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపూడి వైద్య శిబిరం ద్వారా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను 100 రూపాయలకు అందిస్తున్నారు. బోడేపూడి వైద్య శిబిరంలో ప్రతి నెల వందల మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. ఆదివారం వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ షుగర్ పేషెంట్లు ప్రధానంగా తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలని, ప్రతి రోజు తప్పకుండా 30 నిమిషాలు వాకింగ్ చేయాలని, ఒత్తిడి లేని జీవితం గడపాలని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బిపి, సుగర్ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు సీజనల్ వ్యాధులు రాకుండా జాగర్తగా ఉండాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజు కాచి చల్లార్చి మంచినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి వైద్య శిబిరం వాలంటీర్లు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్ రావు, బొంతు సమత, మాదినేని రజిని, కంభంపాటి సత్యనారాయణ, మల్లెంపాటి ప్రసాదరావు, హరి వేంకటేశ్వరరావు, పూనాటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ స్వార్థం కోసం విద్యా వ్యవస్థను నాశనం చేయవద్దు



**ఇబ్రాహింపట్నం, నేటి శుభోదయ :** మంచాల మండలంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై బీఆర్ఎస్ ఆరోపణలను శనివారం ఖండించిన అభివృద్ధి కమిటీకేసీఆర్ హయాంలో కట్టిన భవనాలకే తుదిమెరుగులు దిద్దారన్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదు: కమిటీ సభ్యుల స్పష్టీకరణ.పాఠశాల అభివృద్ధికి అందిన రూ. 10.91 కోట్ల నిధుల వివరాలను బహిరంగపరిచిన విద్యా కమిటీ.ఎస్‌డిఎఫ్ సంస్థ నుండి రూ. 3 కోట్లు, ప్రభుత్వం ద్వారా రూ. 5.31 కోట్లు అందినట్లు వెల్లడి.పిఎం శ్రీ పథకం ద్వారా రూ. 34 లక్షలు, వివిధ శాఖల ద్వారా రూ. 18 లక్షల నిధులు మంజూరుఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నందున మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.12 కోట్లు దాటే అవకాశం ఉందన్న కమిటీ.గతంలో అడ్మిషన్లపై ఆసక్తి చూపని గ్రామస్థులు.. ఇప్పుడు సీఎం ప్రారంభించాక పెరిగిన భారీ తాకిడి.నిధుల లెక్కలపై అవగాహన లేకుండా ఉపాధ్యాయుల, అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా అసత్య ప్రచారాలునిరుపేద పిల్లల భవిష్యత్తుతో ఆడుకోవద్దని,చేతనైతే స్కూల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# బల్లేపల్లి, పాండురంగాపురం గ్రామాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం



**ఖమ్మం, నేటి శుభోదయ :** వర్షాకాలంలో చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి, అంటువ్యాధుల వ్యాప్తిని నివారించడానికి, మిసెస్ ఇండియా విజేత, ఫిట్ ఇండియా అంబాసిడర్, స్వచ్ఛ సర్వేక్షణ్ అంబాసిడర్, సామాజిక కార్యకర్త, మార్పుకర్త అయిన డాక్టర్ ఎం.ఏ. ఫర్హా నాయకత్వంలో బల్లేపల్లి, పాండురంగాపురం గ్రామాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం బల్లేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమైంది. ఇక్కడ విద్యార్థులకు సరైన పద్ధతిలో చేతులు కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వైరల్ జ్వరాలు, కడుపు ఇన్ఫెక్షన్లు, ఇతర అంటువ్యాధుల వంటి కాలానుగుణ అనారోగ్యాలను నివారించడంలో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం ఎలా సహాయపడుతుందో డాక్టర్ ఫర్హా వివరించారు. హ్యాండ్‌వాష్ ఉత్పత్తులను పంపిణీ చేశారు. పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ అవగాహన కార్యక్రమాన్ని తరువాత పాండురంగాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి విస్తరించారు. అక్కడ వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, వ్యాధులు ప్రబలకుండా నివారించడంపై సమాజ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశుభ్రత ప్రచారానికి మద్దతుగా ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తలకు హ్యాండ్‌వాష్ ఉత్పత్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫర్హా మాట్లాడుతూ వ్యక్తులను, సమాజాలను అంటువ్యాధుల నుండి రక్షించడానికి చేతుల పరిశుభ్రత అనేది అత్యంత సరళమైన, ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి అని నొక్కి చెప్పారు. కుటుంబాలు సరైన పరిశుభ్రత పద్ధతులను పాటించాలని, పిల్లలు మరియు విస్తృత సమాజంలో అవగాహన కల్పించాలని ఆమె ప్రోత్సహించారు.ప్రజా ఆరోగ్యం, పారిశుధ్యం, సామాజిక సంక్షేమం పట్ల ఆమె చేసిన అంకితమైన సేవకు గుర్తింపుగా, పాండురంగాపురం అంగన్‌వాడీ కేంద్రం అధిపతి ఎ.ఎం. సత్యవాణి, ఆమె సహోద్యోగులతో కలిసి డాక్టర్ ఎం.ఎ. ఫర్హాను సత్కరించారు. ఆరోగ్యం, పరిశుభ్రత సమస్యలపై అవగాహన కల్పించడంలో ఆమె చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు.ఈ ప్రచారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక నివాసితులు చురుకుగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడంలో పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, "శుభ్రమైన చేతులు ప్రాణాలను కాపాడతాయి" అనే బలమైన సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# గీత కార్మికుడు సుంకరి లచ్చయ్య గౌడ్ సతీమణి సుంకరి సత్యమ్మ దశదినకర్మ



**ఇబ్రాహింపట్నం, నేటి శుభోదయ :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో జరిగిన గీత కార్మికుడు సుంకరి లచ్చయ్యగౌడ్ సతీమణి సుంకరి సత్యమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని సత్యమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన గౌడ సంఘం పెద్దలు సభ్యులు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు ఈ కార్య క్రమంలో గౌడ సంగం పెద్దలు చెరుకు నరసింహగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ముద్దం శంకరయ్యగౌడ్ పెద్దగోని శ్రీనివాస్ గౌడ్ మద్దెల కృష్ణగౌడ్ దూసరి రమేష్ గౌడ్ పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్ దూసరి రాజు గౌడ్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జయశ్రీ – హరీష్ నాయక్ నిశ్చితార్థ వేడుక కార్యక్రమం



**ఖమ్మం అర్బన్, నేటి శుభోదయ :** రఘునాథపాలెం మండలం వి. వెంకటాయ పాలెం గ్రామంలో ఆదివారం జయశ్రీ – హరీష్ నాయక్‌ల నిశ్చితార్థ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హర్యాతండా ఉప సర్పంచ్ శ్రీను నాయక్ వారి సతీమణి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, వారి సతీమణి శీల తదితరులు హాజరై నవ వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న జయశ్రీ – హరీష్ నాయక్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని వధూవరులను అభినందించారు

## ఆరుట్ల గ్రామలో కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా రావుల భాష.. ఉపాధ్యక్షుడిగా చిందం యాదయ్య ..**



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :** మంచాల మండలం ఆరుట్ల గ్రామం కురుమ సంఘం పెద్దల సమక్షంలో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రావులభాష ఉపాధ్యక్షుడిగా చిందం యాదయ్య ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కురుమ సంఘం అధ్యక్షుడు రావుల భాష మాట్లాడుతూ నాపై ఉన్న నమ్మకంతో కురుమ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కురుమ సంఘం పెద్దలకు సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కురుమ సంఘానికి ఎల్లప్పుడూ అండగా ఉంటా ఎవ్వరికి ఏసమస్య వచ్చినా సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాను అన్నారు చిన్న చిన్న గొడవలు ఉంటే పోలీస్ స్టేషన్ కు వెళ్లకుండా సంఘం దృష్టికి తీసుకురావాలి సంఘంలోనే పరిష్కారం కురుమ సంఘం పెద్దలం అందరం కలిసి పరిష్కారం కోసం కృషి చేస్తాం అని అన్నారు కురుమ సంఘం సభ్యులందరూ కలిసిమెలిసి ఉండాలి ఐక్యంగా ఉంటేనే కురుమ సంఘం సభ్యులు ఎలా కలిసి ఉంటారో తెలుస్తుంది అని అన్నారు అనంతరం కురుమ సంఘం పెద్దలు అందరూ కలిసి నూతనంగా అధ్యక్షుడిగా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రావుల భాష చిందం యాదయ్య లను కురుమ సంఘం సంప్రదాయం ప్రకారం రుమాలు కట్టి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు ఈకార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## త్రివేణి లో ఫాదర్స్ డే వేడుకలు




**ఖమ్మం, నేటి శుభోదయ :** తండ్రుల ప్రేమ, త్యాగం, బాధ్యతలను గుర్తుచేసే ఫాదర్స్ డే వేడుకలను ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పిల్లల తండ్రులు,విద్యార్థినీ విద్యార్థుల తండ్రులు ప్రత్యేక అతిథులుగా పాల్గొని ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పిల్లల జీవిత ప్రయాణంలో తండ్రి పాత్ర చాలా కీలకమని, కుటుంబానికి అండగా నిలుస్తూ పిల్లలకు విలువల నేర్పుతూ పెంచుతున్న ప్రతి తండ్రికి ఈరోజు అంకితమని" తెలియజేశారు.విద్యార్థులు తండ్రుల పట్ల తమ ప్రేమాభిమానాలను వ్యక్తపరుస్తూ వారి తండ్రులకి పాద పూజ చేశారు, చేతి ముద్రలు తీసుకున్నారు.వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, ప్రసంగాలు నిర్వహించారు. తండ్రులు కూడా పిల్లలతో కలిసి వివిధ వినోదాత్మక కార్యక్రమాలలో పాల్గొని ఆహ్లాదకరమైన క్షణాలను గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకి విలువలతో కూడిన విద్య తో పాటు తల్లిదండ్రుల ప్రాధాన్యత తెలియజేసేలా ప్రతి సంవత్సరం ఫాదర్స్ డే, మదర్స్ డే,ని కూడా నిర్వహిస్తామని తెలిపారు.పిల్లలు తమ తండ్రులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రత్యేకంగా రూపొందించిన గ్రీటింగ్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమం కుటుంబ విలువలను పెంపొందించే విధంగా విజయవంతంగా సాగింది.ఈ వేడుకలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్,ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఆరు డిఏ లను విడుదల చేయడంతో పాటు పిఆర్సిని వెంటనే ప్రకటించాలి




**ఖమ్మం, నేటి శుభోదయ :** తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం జిల్లా అధ్యక్షులు ఎల్ గోపీచంద్ అధ్యక్షతన ఖమ్మం నగరం లోనిమంచికంటి భవన్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు ఎల్ గోపీచంద్, వి. మల్లికార్జున రావు లు మాట్లాడుతూ ప్రభుత్వం రిటైర్ అయిన ఉద్యోగస్తుల బకాయిలను చెల్లించకుండా,ఆరు డిఏ లను విడుదల చేయకుండా పిఆర్సి ని ప్రకటించకుండా ఎంప్లాయ్ హెల్త్ కార్డ్స్ కి సంబంధించిన ట్రస్ట్ ను ఏర్పాటు చేయకుండా, హడావిడిగా ఉద్యోగుల మరియు పెన్షనర్ల వేతనాల నుండి 1.5 శాతం నగదు ను మే నెల వేతనాల నుండి మినహాయించడం జరిగిందని. కేవలం హెల్త్ కేర్ ట్రస్ట్ ను మాత్రమే ఏర్పాటు చేశారు కానీ దాని సమావేశం నిర్వహించడం కానీ మార్గదర్శకాలు విడుదల చేయటం గాని పానెల్ ఆసుపత్రులను నిర్ణయించడం గానీ జరగలేదని హెల్త్ కార్డులు అందించేయలేదని, కోత విధించి 20 రోజులు గడిచినను దాని ప్రయోజనాలు ఏ ఒక్కరికి అందలేదని ఈ మధ్యకాలంలో ఆసుపత్రి పాలైన వారు స్వంత ఖర్చుల తోటే వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే నగదు రహిత వైద్యాన్ని అందించాలని, రిటైర్ అయిన ఉద్యోగస్తులకు వెంటనే పెండింగ్లో ఉన్న ఆరు డి ఏ లను విడుదల చేయాలని పిఆర్సిని వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేయడం జరిగింది. సమావేశంలో ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి నెల్లూరి వీరబాబు గత నాలుగు నెలలుగా జరిగిన కార్యకలాపాల నివేదిక ప్రవేశ పెడుతూ సంఘం తరపున రిటైర్ అయిన ఉద్యోగస్తులకు పెన్షన్ ఇప్పించడం మరియు పెన్షనర్లు ఎవరైనా మరణించినట్లయితే వారి జీవిత భాగస్వాములకు ఫ్యామిలీ పెన్షన్ ఇప్పించుటకు కృషి చేయడంతో పాటు కోల్ మైన్స్ ఎంప్లాయిస్ కు సంబంధించిన సమస్యలపై రెప్రజెంటేషన్ చేయటం జరిగిందని ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలియజేయతూ వారి సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని ఏపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ 9000 పెంచడానికి నిరంతర కృషి చేస్తున్నామని తెలియ చేయడం జరిగింది కార్యదర్శి నివేదికపై ఖమ్మం జిల్లాలో కల 12 డివిజన్ల బాధ్యులు పాల్గొని వారి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. సమావేశంలో ఈ మధ్యకాలంలో రిటైర్ అయిన ఉద్యోగస్తుల్ని సన్మానించి సంఘంలోకి ఆహ్వానించడం జరిగింది. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి ఝాన్సీ కుమారి,వై రవికుమార్, జిల్లా కార్యదర్శులు వై. శ్రీనివాసరావు, కే కుటుంబరావు, వైకుంఠరావు, భాస్కర్ రెడ్డి, మీరా ఖాన్, లక్ష్మణరావు, కె రాములమ్మ చిట్టెమ్మ, రమణశేఖరం, ఆంజనేయులు, అంజయ్య,గణపతి, స్వామి, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్ రావు కె. రామకృష్ణ, వెంకటేశ్వరావు చంద్రశేఖరరావు భాస్కరన్, రంగయ్య, యం నరసింహారావు లు తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపాలెం 218 సర్వే నెంబర్ల నిర్వాసితులకు న్యాయం చేయాలి






**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా ఖమ్మం నియోజకవర్గం రఘునాథ పాలెం మండలంలోని 218 సర్వే నెంబర్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 625 మంది అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. నాడు రవాణా, మౌలిక వసతులు పూర్తిగా అందుబాటులో లేకపోయినా, లబ్ధిదారులు తమ స్తోమతకు తగ్గట్టుగా బేస్‌మెంట్లు నిర్మించుకుని, కొందరు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అనంతరం అమరావతి హైవే నిర్మాణం పేరుతో కొన్ని ప్లాట్లు రద్దు చేయగా, మరికొన్ని మోడల్ స్కూల్ కోసం కేటాయించారని పేర్కొన్నారు. అయితే ఎటువంటి అడ్డంకులు లేని మిగిలిన సుమారు 350 ప్లాట్లను కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో భాగంగా గత పది రోజులుగా లబ్ధిదారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా బేస్‌మెంట్లు, నిర్మాణాలను కూల్చివేస్తున్నారని ఆరోపించారు.ఈ సమస్యను నిర్వాసితులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి పార్టీ నాయకులను సంఘటన స్థలానికి పంపించారు. మాజీ నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బృందం నిర్వాసితులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించింది. కూల్చివేతలతో శిథిలాలుగా మారిన నిర్మాణాలను చూసి నిర్వాసితులు భావోద్వేగానికి గురై ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం పగడాల నాగరాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో 3000 వేల మందికి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించకపోతే, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో, అప్పటి ఎంపీగా ఉన్న ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సుమారు 625 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారని గుర్తు చేశారు. అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, బోర్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని ప్రోత్సహించారని, ప్రజలు కూడా తమకు చేతనైన మేరకు నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ వారి జీవితాలను రోడ్డున పడేస్తోందని విమర్శించారు.వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితుల సమస్య ఇంకా పరిష్కారం కాకముందే రఘునాథపాలెం 218 సర్వే నెంబర్లలో మరోసారి పేదల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని అన్నారు. ఇళ్లు నిర్మించే ప్రభుత్వాలను, పట్టాలు ఇచ్చే ప్రభుత్వాలను చూసామని, కానీ పేదల ఇళ్లను కూల్చే ప్రభుత్వాన్ని ఇప్పుడు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలో వేలాది మంది పేదలకు ఇంటి పట్టాలు అందించిన ఘనత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌దేనని పేర్కొంటూ, ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం, మోడల్ స్కూల్ కోసం భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు, మిగిలిన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరారు. అలాగే అందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై త్వరలో నిర్వాసితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ ప్రసాద్, కందాల వీరేందర్, వాంకుడోత్ సురేష్, ఆరెంపల వీరభద్రం, సత్తార్ మియా, తీగల సతీష్ గౌడ్, పోలే రమేష్, పొంగు వెంకట్, మిర్యాల రమేష్, పిట్టల తిరుమల్ రమేష్, గుంటి రాజు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'ఫాదర్స్ డే' రోజు ఖమ్మంలో విషాదం

**- కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారులు బలి**

**ఖమ్మం, నేటి శుభోదయ :** ఫాదర్స్ డే' రోజే ఖమ్మం జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తల్లిదండ్రుల మధ్య కలహాలు అభశుభం తెలియని ఇద్దరు చిన్నారుల నిండు ప్రాణాలను బలిగొన్నాయి.ఖమ్మం త్రీ టౌన్ పరిధిలో లింగరాజు, స్వాతి దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే, గత కొద్దిరోజుల భార్యభర్తల నడుమ పంచాయితీలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి, ఆవేశానికి గురైన భార్య స్వాతి ఆదివారం ఉదయం తన ఇద్దరు కొడుకులు వేదిక్ కుమార్ (7), తనిష్క్ (5) పురుగుల మందు తాగించింది. అనంతరం స్వాతి కూడా అదే విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది.

**చిన్నారులు మృతి, తల్లి పరిస్థితి అత్యంత విషమం**

అయితే, విష ప్రభావంతో ఇద్దరు చిన్నారులు విలవిలలాడుతూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరోవైపు, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తల్లి స్వాతిని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి కూడా



అత్యంత విషమంగా ఉన్నట్లుగా వైద్యులు పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

## - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్







**ఖమ్మం, నేటి శుభోదయ :** ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని, యోగతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడల శాఖల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం – 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని అన్నారు.యోగా దినమున జరిగే కార్యక్రమంలో ఆయుష్ శాఖ వారు పాల్గొనేవారని, ఇక్కడ పౌర సమాజం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యాధికారి డా. వేణుమాధవ్, నోడల్ అధికారిణి డా. పద్మావతి, నేచురోపతి డాక్టర్ కనకమహాలక్ష్మి , జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సన్న రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలే

**ఖమ్మం, నేటి శుభోదయ :**

చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వ సరఫరా చేస్తున్న సన్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్ కుతరలిస్తున్న రేషన్ డీలర్లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కల్లూరు ఎస్సై హరిత తెలిపారు.ఏప్రియల్ 24, 25 తేదీలలో సివిల్ సప్లై డిపార్ట్మెంట్ లోని సత్తుపల్లి సివిల్ సప్లై చెకింగ్ ఇన్స్పెక్టర్, ఎన్ఫోర్స్మెంట్ టాస్కోఫోర్స్ టీం ఓఎస్ డి ఆధ్వర్యంలో కల్లూరు మండలం పేరవంచలో గల ఎఫ్ పి షాప్ నెంబర్ 2232015, కల్లూరు మండలం ఖాన్ ఖాన్ పేట ఎఫ్ పి షాప్ నెంబర్ 2232005 లలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయగా ఎఫ్ పి షాప్ నెంబర్ 2232015 లో స్టాక్ రిజిస్టర్ లో ఉండవలసిన దాని కన్నా 12.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం 71,775 రూపాయల విలువైనవి అదేవిదంగా ఎఫ్ పి షాప్ నెంబర్ 2232005 లో 64.01 క్వింటాళ్ల 3,67,545 రూపాయల విలువైన రేషన్ బియ్యం అదనంగా ఉండడంతో రేషన్ డీలర్లను విచారించగా ఇరువురు అవకతవకలకు పాల్పడి, ప్రభుత్వం సరఫరా చేయుచున్న సన్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ రేషన్ కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్కు రీసైకిల్ చేస్తున్నట్లుగా గుర్తించి రేషన్ షాప్ డీలర్ అయిన రాయల నాగేశ్వరరావు, నివాసం పేరువంచ అను అతనిపై చీటింగ్, నమ్మకద్రోహం సెక్షన్ల కింద సివిల్ సప్లై అధికారి వేముల నరేష్ ఫిర్యాదు మేరకు సదరు ఇరువురు రేషన్ డీలర్ల పై కేసులు నమోదు చేశారు . ఆయా కేసులలో ఒక రేషన్ డీలర్ అయిన రాయల నాగేశ్వరరావు, మెరుగు వేలాద్రి, నివాసం ఖాన్ ఖాన్ పేట చెందిన వ్యక్తులను అరెస్ట్ చేసి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్తుపల్లి ముందు హాజరు పరచగా ఇరువురికి జులై 3 వరకు జుడీషియల్ రిమాండ్ విధించారని తెలిపారు. కల్లూరు మండలంలో ఎవరైనా రేషన్ డీలర్లు లేదా బియ్యం వ్యాపారస్తులు పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యాన్ని అక్రమంగా నిలువ చేస్తూ వ్యాపార నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. అలాగే అట్టి వ్యాపారం నిర్వహించే వారి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన పారితోషికం ఇస్తామని పేర్కొన్నారు.

# అర్హులైన కూలీలందరికీ కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలి

## - సిద్ధినేని కర్ణకుమార్ డిమాండ్



**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద వెంటనే కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ శాఖ సమావేశం చుట్టూ వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిద్దినేని కర్ణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి భద్రత కల్పించాల్సిన ఉపాధి హామీ పథకాన్ని అధికారులు, ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త జాబ్ కార్డుల కోసం పేదలు నాలుగేళ్లుగా దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఒకవైపు అర్హులకు కొత్త కార్డులు ఇవ్వడం లేదు సరే, మరోవైపు ఇప్పటికే పాత కార్డులు ఉన్నవారికి కూడా నాలుగేళ్లుగా సరిగ్గా పనులు చూపించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 14 వారాలుగా కూలీలు చేసిన పనికి రావాల్సిన ఉపాధి బకాయి డబ్బులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, నీడ సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అలాగే, ఏళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న అర్హులైన వితంతు మహిళలకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదల సమయాన్ని వృథా చేస్తూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల మొండి వైఖరి నశించాలన్నా, మన హక్కులు సాధించుకోవాలన్నా పోరాటమే శరణ్యమని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహా ముట్టడి కార్యక్రమానికి భైరవునిపల్లి గ్రామం నుండే కాకుండా మండలంలోని ప్రతి గ్రామం నుండి ఉపాధి కూలీలు, వితంతువులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, గ్రామ సహాయ కార్యదర్శి బాలెబోయిన వేంకటేశ్వర్లు, శాఖ సభ్యులు కుంచం బిక్షం, ముత్యాల వేంకటేశ్వరరావు, బాలిన పెద్ద నారాయణ, బాలిన చిన్న నారాయణ మరియు ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం




**రాజేంద్ర నగర్, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ రాజేంద్ర నగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ స్కూల్ ప్రేమవతి పేట గ్రామంలో యోగా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ..యోగా అనేది భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన గొప్ప వరం.యోగ వల్ల వచ్చే లాభాలు ఆరోగ్యం,చదువు, క్రమశిక్షణ మనకి మంచి అలవాట్లు వస్తాయి.ప్రతి ఒకరు యోగాన్ని ప్రతిరోజు చేయాలని పిలుపు ఇవ్వడం జరిగింది.యోగా గురువులు మూల్ చంద్ శర్మ జి,అజిత్ సింగ్,హరి కిషన్ కి,సోల్కర్ రెడ్డి,డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,పద్మావతి,భవాని దాస్,నారతం రెడ్డి,మురళీమోహన్, ఆగపల్లి నరసింహ,దయానంద్,జంగయ్య,యాదగిరి యాదవ్, ఈశ్వర్, రాజు రెడ్డి, భాష, నాయకులు పాల్గొన్నారు

# ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్‌గా మారుతి వీరభద్ర ప్రసాద్ నియామకం



**ఖమ్మం, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు మారుతి వీరభద్ర ప్రసాద్ ను బీజేపీ ధార్మిక సెల్ ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా నియమించారు. 1987లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, అనంతరం బీజేపీ ఖమ్మం నగర అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు జిల్లా ఉపాధ్యక్షుడిగా, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్‌గా, జిల్లా అధికార ప్రతినిధిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు.తనపై విశ్వాసం ఉంచి ధార్మిక సెల్ ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా నియమించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు, రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్ అన్నావుజుల సూర ప్రకాష్ రావు, పొంగులేటి సుధాకర్ రెడ్డిలకు మారుతి వీరభద్ర ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతంతో పాటు దేవాలయాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో చురుకైన పాత్ర పోషిస్తానని ఆయన పేర్కొన్నారు.

# యోగతో ఆరోగ్యం, యోగతో ఆనందం

## - అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జమాల్ ఖాన్



**చింతూరు, నేటి శుభోదయ :** యోగాతో ఆనందం ఆరోగ్యం లభిస్తుందని చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్ పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీషాదేవి సూచనల మేరకు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చింతూరు లోని ట్రైబల్ గర్ల్స్ హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు ఎంపీడీవో శ్రీనివాస్ దొర ,విద్యార్థులు, జమాల్ ఖాన్ యోగా సాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనగా, లక్షలాది మంది యోగా సాధన చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది విజయవాడలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ పాల్గొని యోగా ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేశారని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా అత్యంత అవసరమైందని, శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఆత్మకు ఆనందాన్ని ప్రసాదించే యోగాను ప్రతి కుటుంబం తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని జమాల్ ఖాన్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పసుపులేటి సల్మాన్ రాజు,టీడీపీ సీనియర్ నాయకులు పొదిలి రామారావు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు రోజుకు గంట యోగా చేస్తేనే ఆరోగ్యవంతమైన భారత్ నిర్మాణం

## - కొప్పుల రాజశేఖర్ రెడ్డి




**వికారాబాద్, నేటి శుభోదయ :** దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే ప్రతి పౌరుడు రోజుకు కనీసం ఒక గంట యోగా చేయాలని బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని తెలిపారు.నరేంద్ర మోదీ పిలుపుతో యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించబడుతుండటం గర్వకారణమన్నారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ సాధ్యమవుతుందని వివరించారు.ప్రతి ఒక్కరూ యోగాతో పాటు ధ్యానం కూడా తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యోగా సాధకులు, సమితి సభ్యులు, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## - బిజెపి నాయకులు పిట్టల సూరిబాబు



**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వాటిని సమరీక్షించాలని బిజెపి ఓబీసీ మండల అధ్యక్షులు పిట్టల సూరిబాబు అన్నారు. నరేంద్రమోదీ 12 సంవత్సరాల పాలన సందర్భంగా రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పిట్టల సూరిబాబు ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా స్థానిక సెంటర్లో ఓబీసీ మోర్చా నాయకులతో మొక్కను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి 12 ఏళ్ల పాటు ప్రధానిగా అనేక సేవలు అందించారని పేర్కొన్నారు.అన్ని వర్గాల ప్రజలు కేంద్ర ప్రభుత్వంతో సంక్షేమ ఫలాలు పొందారని అన్నారు. మోడీ పాలనలో దేశం మరింత ముందుకు పోతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల నాయకులు షేక్ షర్ఫుద్దీన్ పురాణం దివాకర్, సయ్యద్ మోహినుద్దీన్,కొండా హర్షవర్ధన్, ఓబీసీ నాయకులు, కందరబోయిన గోపి, దేశబోయిన వేణుబాబు, పుట్టా సత్యనారాయణ, ఎలిగేటి గిరి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన భాగం హేమంత రావు, వెన్నుపూసల సీతారాములు



**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన నూతన పట్టువస్త్రాల వేడుక నయనానందకరంగా సాగింది. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు – నందిని దంపతుల కుమారుడు, కుమార్తెల నూతన పట్టువస్త్రాల వేడుకలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, కాంగ్రెస్ మండల నాయకులు నల్లని మల్లికార్జున్ రావు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్ ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారులకు దీవెనలు అందించారు.

# చిన్నారిని ఆశీర్వదించిన శెట్టి



**ఖమ్మం, వైరా, నేటి శుభోదయ :** వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ – కల్పన దంపతుల కుమార్తె వేదిత సైన ఓణీలు ఫంక్షన్ వైరా కమ్మవారి కళ్యాణ మండపం నందు జరిగింది. ఈ కార్యక్రమంకు వెళ్లి చిన్నారిని ఆశీర్వదించిన మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, మహిళా జిల్లా అధ్యక్షురాలు పగడాల మంజుల, కట్ల రంగారావు, గోవింద్ శ్రీనివాస్,మల్లెల రవీంద్ర ప్రసాద్, ముళ్ళపాటి సీతారాములు,కోనేటి నారాయణ,మాటేటి రవి, సి హెచ్ విప్లవ కుమార్, జి శ్రీదేవి, కాసిన్ని శ్రీనివాస్, నాగరాజు, కుటుంబరావు, కట్ల నాగరాజు, కట్ల శ్రీకాంత్,సుకన్య, కట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి అండగా నిలిచి సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, నేటి శుభోదయ :** పేదల సంక్షేమం, అర్హులైన ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం నగరానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కేవలం 24 గంటల్లో స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని కేటాయించడం ప్రజా సంక్షేమానికి నిదర్శనమని తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థిని తురక దేవీప్రసన్న ఏఎస్ఆర్ ప్రభుత్వ కాలేజీలో చదువుతూ ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరంలో 434 మార్కులు రావడంతో పాటు జాతీయస్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించగా, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శుక్రవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లా సమక్షంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా దేవీప్రసన్న రూ.50వేల నగదు, జ్ఞాపికను అందుకుందని అన్నారు. అట్టి సందర్భంలో ముఖ్యమంత్రి విద్యార్థిని పలకరించి, కుటుంబ పరిస్థితి తెలుసుకోగా, తన తండ్రి లేరని, తల్లి జ్యోతి ఎన్నో కష్టాలుపడి ఇద్దరు కుమార్తెలను చదివిస్తోందని, ఉండేందుకు కనీసం ఇల్లు లేదని తెలిసి చలించిన ముఖ్యమంత్రి, ఆ కుటుంబానికి రెండు పడక గదుల ఇంటిని మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ దివాకర టిఎస్ లను ఆదేశించారు.సీఎం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిందని, కుటుంబ పరిస్థితులను పరిశీలించిన అధికారులు, ఆ కుటుంబం నివాస సమస్యతో ఇబ్బందులు పడుతోందని నిర్ధారించిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎలాంటి జాప్యం లేకుండా ఇంటి కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి, ఖమ్మం నగరంలోని వైఎస్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంలో రెండు పడక గదుల ఇంటిని కేటాయించినట్లు, శనివారం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, దేవీప్రసన్న కుటుంబ సభ్యులకు ఇంటి కేటాయింపు ఉత్తర్వులను అందజేశారన్నారు. ఇంటి కేటాయింపు ఉత్తర్వులను అందుకున్న కుటుంబ సభ్యులు సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి, జిల్లా మంత్రివర్యులు, అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎవరికైనా సమస్య ఉంటే ప్రభుత్వం తప్పకుండా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చివరి అర్హుడి వరకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వేగంగా స్పందించి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే పరిష్కారం చూపడం అభినందనీయమని పేర్కొంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఖమ్మంలో జేఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగ డే కార్యక్రమం : రాధాకృష్ణ

**ఖమ్మం, నేటి శుభోదయ :** 12 వ ఇంటర్నేషనల్ డే అఫ్ యోగా ను పురస్కరించుకుని ఖమ్మం జిల్లా జె యస్ యస్ డైరెక్టర్ వై రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలో గల జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జె యస్ యస్ మెయిన్ అండ్ సబ్ సెంటర్స్ లలోని బెనెఫిషరీస్, ఇతరులతో ఘనంగా యోగ డే ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జె యస్ యస్ ఖమ్మం జిల్లా డైరెక్టర్ వై రాధాకృష్ణ కొన్ని ఇంపార్టెంట్ పాయింట్స్ వివరించారు. యోగా ప్రాముఖ్యతను తెలిపారు. యోగా శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.శరీరానికి బలం, వశ్యత సమతుల్యతను పెంచుతుంది.మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.ఒత్తిడి ఆందోళనను తగ్గిస్తుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుతుంది.రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. రక్త ప్రసరణను సక్రమంగా ఉంచుతుంది. మంచి నిద్రకు సహాయ పడుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేస్తుంది. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తుంది. ఈ కార్యక్రమంలో యోగా బోధకులు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ పద్ధతులు, ధ్యాన అభ్యాసాలను ప్రదర్శించి, పాల్గొనేవారికి యోగా యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలను వివరంగా వివరించారు. పాల్గొనేవారు తాడాసన, వృక్షాసన, భుజంగాసన, వజ్రాసన, అనులోమ్–విలోమ్, కపాలభాతి ఇతర యోగా వ్యాయామాలను అభ్యసించారు. యోగా నిపుణులు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మానసిక శ్రేయస్సు కూడా పెరుగుతుందని, ఒత్తిడి, ఆందోళన మరియు వివిధ వ్యాధులను నివారించడంలో సహాయపడుతుందని నొక్కి చెప్పారు.శిక్షణార్థులు, సిబ్బంది అందరూ యోగాను వారి దైనందిన జీవితంలో చేర్చుకోవాలని ప్రోత్సహించారు. తద్వారా వారు ఆరోగ్యకరమైన, చురుకైన, సానుకూల జీవితాలను గడపగలరు. ఆరోగ్యకరమైన శరీరం, ఆరోగ్యకరమైన మనస్సు విజయానికి కీలకం అని, ఈ లక్ష్యాన్ని సాధించడానికి యోగా ఒక ముఖ్యమైన సాధనం అని డైరెక్టర్ వై రాధాకృష్ణ నొక్కి చెప్పారు.కార్యక్రమం ముగింపులో, పాల్గొన్న వారందరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తామని, అలాగే తమ కుటుంబ సభ్యులకు, విస్తృత సమాజానికి యోగా ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా, విజ్ఞానదాయకంగా నిరూపించబడింది. అంతేకాకుండా ఆరోగ్యం ఫిట్‌నెస్ గురించి అవగాహనను ప్రోత్సహించడంలో ఇది ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో 170 మంది పాల్గొన్నారు.వివిధ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించిన కార్యాలయ సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు అందరూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు."యోగా ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు మరియు సంతోషకరమైన జీవితానికి ఎంతో ముఖ్యమైనది. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉంటాయి.




# దైవదత్తాలు కాదు శాస్త్రీయ అంశాలే ప్రగతికి సోపానాలు

## - పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు

**బోనకల్, నేటి శుభోదయ :** శాస్త్రీయ దృక్పథంతో మాత్రమే సమాజం పురోగమిస్తుందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో దైవదత్తం – శాస్త్రీయత అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పల్లా కొండలరావు మాట్లాడుతూ దేవుని పేరుతో మనిషి సృష్టించిన మూఢత్వపు ఆలోచనలు, ఆచారాలు సమాజ ప్రగతికి ఆటంకం కలిగిస్తాయన్నారు. సమాజం నిరంతరం మారుతుంటుందనీ ఆ మార్పు పురోగమనం వైపు ఉండేలా చూసేది శాస్త్రీయ దృక్పధం కలిగిన అభ్యుదయ శక్తులు కాగా యథాతథంగా సమాజం ఉండేలా చేసేవి మతోన్మాద ఛాందస శక్తులని తెలిపారు. ఏమిటి ఎందుకు ఎలా అనే సైంటిఫిక్ టెంపర్ ను చిన్నప్పటి నుంచి పిల్లల్లో నేర్పకపోతే సమాజం తిరోగమనం వైపు వెళుతుందన్నారు. తొంభై శాతం నాస్తికులు ఉన్న చైనా అన్ని రంగాల్లో దూసుకుపోతుంటే అడుగడుగునా దేవుళ్ళకు మొక్కే భారత్ అన్నింటా వెనకబడుతోందన్నారు. సమాజం బాగుపడాలంటే మూఢత్వం కంటే విజ్ఞానం పెరగాలన్నారు. ఓ గుడి కడితే లోపలా, బయటా రెండు రకాలుగా అడుక్కునే బిచ్చగాళ్ళు తయారవుతారన్నారు. అదే ఓ బడి కడితే ఎందరో మేధావులు, మహానుభావులు తయారై దేశంలో ఏ రకమైన బిచ్చగాళ్ళు లేకుండా చేస్తారని తెలిపారు. అయితే మతం పేరుతో సాగే భావజాలం వ్యాప్తి చెందినంత తేలికగా వైజ్ఞానిక బోధనలు ప్రజల మెదళ్ళకు ఎక్కించలేకపోతుండడం బాధాకరమన్నారు. వేమన పద్యాలు చెప్పినంత సులువుగా వైజ్ఞానిక బోధనలు ప్రజల భాషలో తేలిక ఉదాహరణలతో చెప్పగలిగే బోధకులు పెరగాలన్నారు. సమాజంలో ఏ అభివృద్ధి అయినా, వస్తువు అయినా ఆఖరుకు పూజారులు, పాస్టర్లు వాడే, అనుభవించే సౌకర్యాలు సైతం సైన్స్ ద్వారా కనుగొన్నవేనని తెలిపారు. మతంలో ఉన్న మంచిని స్వీకరిస్తూనే మూఢత్వంపై పోరాటం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో విద్యాలయాల్లో శాస్త్రీయ అంశాలు బోధించాలని కోరారు. దేవుడిపై పోరాడడం కంటే మనిషే తోటి మనిషికి సాయం చేయగలిగే దైవత్వం పెంచుకోవాలని సూచించారు. కరోనా సమయంలో అన్ని మతాల దేవాలయాలు మూతబడితే కాపాడిన దేవుళ్ళు ఎవరిని ప్రశ్నించారు. సర్వకాల సర్వావస్థలలోను దైవదత్తాలు కంటే శాస్త్రీయ అంశాలు మాత్రమే మానవాళికి ప్రయోజనం కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, సిఐటియు నాయకులు గుగులోతు నరేష్, పి.వి.అప్పారావు, చలమల హరికిషన్ రావు, బొప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# వెయ్యేళ్ళుగా విరాజిల్లుతున్న తెలుగు సాహిత్యం

## - తెలుగుభాష మాధుర్యం వర్ణింపనలవికాదు

**ఖమ్మం, ఇల్లందు, నేటి శుభోదయ :** వెయ్యేళ్ళుగా తెలుగు సాహిత్యం విరాజిల్లుతున్నదని, తీయదనానికి మారుపేరైన తెలుగుభాషా మాధుర్యం వర్ణింపనలవికానిదని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ పేర్కొన్నారు. దేశభాషలందు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలుగు భాషౌన్నత్యాన్ని ఆయన ఈ పత్రికాప్రతినిధికి తెలియజేసారు. సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా,కోట్లాది ప్రజల గుండె చప్పుడుగా వున్న తెలుగు భారతదేశంలో హిందీ, బెంగాలీ తరువాత మూడవ అతి పెద్ద భాష. దాదాపు 9 కోట్లమందికి మాతృభాష. ప్రపంచంలో అత్యధికముగా మాట్లాడబడే భాషల్లో తెలుగుది 15 వ స్థానం. తెలుగు సాహిత్యం 11 వ శతాబ్దం నుండి విరాజిల్లుతోంది. ఆదికవి నన్నయ భారతాన్ని తెలుగులోకి అనువదించి వచన కవిత్వానికి బీజం వేయగా, తెలుగువారికి గర్వకారణమైన తిక్కన భారతంలో నాటకీయతను, వీరత్వాన్ని పోషించారు. వారు సంస్కృతం నుంచి ఎన్నోపదాలు స్వీకరించినా తెలుగు వ్యాకరణం, ఛందస్సు, అలంకారాలతో తెలుగును సుసంపన్నం చేశారు. తెలుగులిపి గుండ్రంగా, అందంగా ఉండుటవల్ల దీనిని 'అక్షరరమ్యత' కు ఉదాహరణగా పేర్కొంటారు. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న శ్రీకృష్ణ దేవరాయలు మాట అక్షర సత్యం. గురజాడ 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని దేశభక్తిని ఇనుమడింపజేశారు. నికోలో కొంటి అనే ఇటలీ దేశస్తుడు తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని కీర్తించాడు. ఇలాంటి తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని, మహోజ్వల వారసత్వాన్ని కాపాడుకోవాలని సూర్యనారాయణ కోరారు.

# ఆర్ కృష్ణయ్య పదవి విరమణ సన్మాన సభ




**సంగారెడ్డి, నేటి శుభోదయ :** ఆదివారం రోజున స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్ నందు శ్రీ ఆర్ కిష్టయ్య ఎస్సీ బయోసైన్స్ ఉపాధ్యాయులు ముబారక్పూర్ నందు పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘన సన్మానం ఇట్టి కార్యక్రమంలో సభాధ్యక్షులు డి. జగన్నాథ్ ఆధ్వర్యంలో జరిగిన సభకు ముఖ్య అతిథులు శ్రీ ఆర్ కృష్ణయ్య గారు రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు మరియు పుష్ప నాగేష్ రాష్ట్ర కురుమ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీహరి బీహార్ ఎస్ నాయకులు జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు జిల్లా గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు మలిశెట్టి యాదవ్ మాజీ జెడ్పిటిసి సాయికుమార్ మీనాక్షి గార్లు స్థానిక ఎమ్మెల్యే తనయుడు శ్రీ సాయి పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం లక్ష్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రామచందర్ మరియు భూమి శ్రీనివాస్ ఏ అశోక్ కుమార్ బుచ్చయ్య సాగర్ పటేల్ మేకల శ్రీనివాస్ శివశంకర్ పాల్గొన్నారు స్థానిక కౌన్సిలర్లు కొత్తగుళ్ల సోము లావణ్య జీ తుల్జారామ్ ఎన్ మానేయ గోపాల్ బసప్ప మల్లేశం కృష్ణారి బీసీ రాష్ట్ర నాయకులు పాండు రిటైర్డ్ ఉపాధ్యాయులు మల్లేశం విశ్వనాథ్ మరియు పూర్ణ కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు సన్మాన గ్రహీత కృష్ణయ్య గారి ఉపాధ్యాయ సేవలను సామాజిక కార్యక్రమాలను గుర్తు చేసుకోవడం జరిగింది. విద్యాభివృద్ధికి విద్య సేవ కార్యక్రమాలలో వారు చేసిన కృషిని ప్రశంసించడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అభిమానులు విద్యార్థులు ఉపాధ్యాయులు శ్రేయోభిలాషులు ఆయన సేవలను కొనియాడడం జరిగింది

# ఖమ్మం జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి ధన్యవాదాల సందేశం

**ఖమ్మం, నేటి శుభోదయ :** గౌరవనీయులైన పార్టీ పెద్దలకు, నాయకులకు, నన్ను గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్న ఖమ్మం జిల్లా బిజెపి కుటుంబ సభ్యులందరికీ మంద సరస్వతి నమస్కారాలు తెలిపారు. నన్ను నమ్మి, నాపై నమ్మకంతో ఖమ్మం జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలుగా బాధ్యతలు అప్పగించినందుకు భారతీయ జనతా పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు కి, మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్ప రెడ్డి కి, జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి కి, రాష్ట్ర కోశాధికారి వాసు దేవరావు కి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు కి, సీనియర్ బీజేపీ ఖమ్మం జిల్లా రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, నాతోటి సహచర బీజేపీ కార్యకర్తలకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.నాకు ఖమ్మం జిల్లా నాయకులు కార్యకర్తలు అందరు సహకరించాలి అని కోరుకుంటున్నాను. గతంలో మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి గా, జిల్లా ఉపాధ్యక్షరాలుగా చేసినాను. ఈ మహత్తరమైన బాధ్యతను ఒక పదవిగా కాకుండా, సమాజంలో మహిళల సాధికారత కోసం, మన పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేసే ఒక గొప్ప అవకాశంగా నేను భావిస్తున్నాను.



# వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక ఘనంగా నిర్వహణ

**సంగారెడ్డి, నేటి శుభోదయ :**
విశ్వ లింగాయత్ మ్యారేజ్ బ్యూరో, మలక్‌పేట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మలక్‌పేట్‌లోని శుభకరి ఏసీ ఫంక్షన్ హాల్‌లో వీరశైవ లింగాయత్/జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక ఈ రోజు ఎంతో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా బ్యూరో నిర్వాహకులు పసారం శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా తమ మ్యారేజ్ బ్యూరో ద్వారా అనేక మంది వధూవరులకు వివాహాలు జరిపించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ సురేష్ షట్కార్ మాట్లాడుతూ, ఈ వివాహ వేదిక ద్వారా తమ కుటుంబంలో కూడా



వివాహం జరగడం ఆనందంగా ఉందని తెలిపారు.అనంతరం పసారం శ్రీనివాస్ దంపతులను సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం తరఫున ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సమాజ పెద్దలు, రెవెన్యూ జిల్లా మాజీ అధ్యక్షులు శివప్రసాద్, జిల్లా సలహాదారులు అన్నిశెట్టి జయప్రకాష్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి శారద శివకుమార్, మీర్‌పేట్ సమాజ అధ్యక్షులు శరణ్, శివశరణప్ప తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

**ఖమ్మం రూరల్, నేటి శుభోదయ :**
ఈనెల 23న (బీకేఎంయూ) వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డులో ఉన్న ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పెండ్లి నర్సిరెడ్డి అధ్యక్షతన మండల సమితి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో భాగం హేమంతరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకురావడం వల్ల గ్రామీణ కార్మికుల జీవనోపాధిపై ప్రతికూల




ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఉపాధి చట్టం లక్ష్యాలను దెబ్బతీసే విధానాలు కొనసాగితే గ్రామీణ పేదలు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధి చట్టాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల కొనసాగింపు కోసం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిలో పార్టీ శ్రేణులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు మేడిది నారాయణరెడ్డి సంస్మరణ సభను ఘనంగా నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడకంటి చిన్న వెంకటరెడ్డి అజ్మీర రామ్మూర్తి సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, లింగా వెంకటనారాయణ, ఎడ్లపల్లి శంకరయ్య, పాసంగుల చంద్రరావు , పగిళ్ల వీరభద్రం, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ , మండల సమితి సభ్యులు పాల్గొన్నారు.

# జయశంకర్ సేవలు మరవలేనివి





**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం త్యాగాలు చేసిన జయశంకర్ సారూ సేవలు మరవలేనివి బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జయశంకర్ వర్ధంతి ని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పరితపించారని పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా అనేక సేవలు అందించారని అన్నారు. జయశంకర్ చరిత్ర ను ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లెబోయిన గోవిందరావు, సయ్యద్ మోహినుద్దీన్, ఎలిగేటి గిరి, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి, దేశబోయిన వేణుబాబు తదితరులు పాల్గొన్నారు. మోడీ చిత్ర పటం కు పాలాభిషేకం పీఎం కిసాన్ నిధులు విడుదల పట్ల బీజేపీ ఆధ్వర్యం లో మోడీ చిత్ర పటం కు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ భీమా పథకం ను అమలు చేసి రైతులను వివత్తు పరిస్థితుల నుంచి కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

## - జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :** జూన్ 22వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాల పై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించ బడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ





**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం హై స్కూల్ గ్రౌండ్‌లో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు శ్రీ సత్య సాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీ భద్రయ్య గురూజీ, శ్రీ మధు గురూజీలు పాల్గొని యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణలో దాని పాత్ర గురించి వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రాజేశ్వరపురంతో పాటు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై యోగా సాధనలో పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని గురూజీలు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన రాజేశ్వరపురం గ్రామ సర్పంచ్ దండా రంగయ్య, ముఠాపురం గ్రామ సర్పంచ్ ఏలూరు రామారావు, భారతీయ జనతా పార్టీ నాయకులు నున్నా రవికుమార్, ఇంటూరి అశోక్, దండా నరసింహారావు, బెల్లం లక్ష్మి , బాగం మురళి, గరిణ వెంకటేశ్వర్లు, భువనగిరి యుగంధర్, నిర్వాహకులను పాల్గొన్న వారు అభినందించారు.

# ఘనంగా యోగా వేడుకలు



**నేలకొండపల్లి, నేటి శుభోదయ** ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ డే లో పలువురు పాల్గొన్నారు. యోగా విన్యాసాలను ప్రదర్శించారు. యోగా వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులతో పాటు బీజేపీ పార్టీ నాయకులు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, పిట్టల సూరిబాబు, రామకృష్ణ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని పలు ప్రవేట్ సంస్థలలో యోగా డే ను నిర్వహించారు. మండలం లోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాలలో పలు చోట్ల యోగా దినోత్సవం ను నిర్వహించారు.

## చిన్నారులను ఆశీర్వదించిన వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు



**తలకొండపల్లి, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి అయిల్ ప్రసాద్ గౌడ్ కుమారుల పుట్టు పంచేల కార్యక్రమం మిడ్జిల్ మండలంలోని వి కన్వెన్షన్ లో జరిగిన కార్యక్రమంలో హాజరై చిన్నారులను ఆశీర్వదించిన తలకొండపల్లి మండలం వెల్జల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి వెంకట్ రెడ్డి మాజీ ఎంపిటిసి జి శ్రీనివాస మూర్తి ఎం అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ లు బి నర్సింలు,అజీజ్,నాయకులు ఏ రవీందర్ గౌడ్ ఎండి యూసుఫ్, కే ప్రకాశ్ రెడ్డి,ఆఫ్తాబ్, తదితరులు పాల్గొన్నారు...

## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ట్రైనర్ వి. హేమలత ఆధ్వర్యంలో ధరూర్‌లో యోగా కార్యక్రమాలు



**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా ధరూర్ మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) మరియు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాచురోపతి యోగ ఇన్స్ట్రక్టర్ వి. హేమలత విద్యార్థులు, సిబ్బందికి యోగా సాధనపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక యోగా శిక్షణ అందించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు.పీహెచ్సీలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శాంతి మరియు వైద్య సిబ్బంది పాల్గొని యోగా సాధన చేశారు. అలాగే కేజీబీవీలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పొందారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పాయి.

## ఎంపీ వద్దిరాజుకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



**హైదరాబాద్ ఖమ్మం, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన పెళ్లి రోజు సందర్భంగా ఆదివారం ఉదయం జూబ్లీహిల్స్ లోని శ్రీవెంకటేశ్వర స్వామి (తిరుమల-తిరుపతి దేవస్థానం) ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకుని తన గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు.ఆలయానికి విచ్చేసిన ఎంపీ రవిచంద్రకు వేద పండితులు సాదర స్వాగతం చెబుతూ శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు పలికారు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు బహుకరించారు.అలాగే,ఎంపీ రవిచంద్ర తనకు చదువు చెప్పిన గురువు ఒద్దిరాజు దశరథ రామయ్య ఆశీస్సులు అందుకున్నారు.పార్లమెంట్ సభ్యులు సుభాష్ కుంతియ (ఒడిషా) రవిచంద్రను శాలువాతో సత్కరించి హృదయపూర్వక పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ కుంతియ,తన గురువు దశరథ రామయ్యలను ఎంపీ రవిచంద్ర శాలువాలు కప్పి సన్మానించారు.ఖమ్మం జిల్లా సువర్ణపురం సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య, సన్నిహితులు చెరుకూరి శేషగిరిరావు-హైమావతి, సందీప్ తదితరులు ఎంపీ రవిచంద్ర పెళ్లి రోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, సీనియర్ జర్నలిస్ట్ సవీన్ ఎంపీ రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పెళ్లి రోజు శుభాకాంక్షలు చెప్పారు, ఈనెల 26వతేదీ సాయంత్రం బేగంపేటలో జరిగే తమ స్వతంత్ర టీవీ ఛానెల్ 4వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా రావలసిందిగా ఆహ్వానించారు.

## షార్ట్ సర్క్యూట్ తో కోళ్ల వ్యాన్ దగ్ధం



**చింతూరు, నేటి శుభోదయ :** షార్ట్ సర్క్యూట్ తో కోళ్లను తరలించే బొలెరో వ్యాన్ ఆదివారం ఏడుగురాళ్లపల్లి కాటుక పల్లి గ్రామాల మధ్య దగ్ధమైంది. చింతూరుకు చెందిన ఒక వ్యాపారి బాయిలర్ కోళ్ల కొనుగోలు చేయడానికి బొలెరో వ్యాన్ ను భద్రాచలం వైపు పంపుతుండగా ఏడుగురాళ్లపల్లి దాటిన అనంతరం సెల్ఫ్ మోటర్ లో షార్ట్ సర్క్యూట్ వల్ల బొలెరో వాహనం మొత్తం దగ్ధమైంది. స్థానికులు బకెట్లతో నీళ్లు తీసుకువచ్చి మంటలను ఆర్పి వేశారు. ఈ సంఘటనపై చింతూరు ఎస్సై సంతోష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

## వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక ఘనంగా నిర్వహణ



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** విశ్వ లింగాయత్ మ్యారేజ్ బ్యూరో, మలక్‌పేట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మలక్‌పేట్‌లోని శుభకరి ఏసీ ఫంక్షన్ హాల్‌లో వీరశైవ లింగాయత్/జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక ఈ రోజు ఎంతో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా బ్యూరో నిర్వాహకులు పసారం శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా తమ మ్యారేజ్ బ్యూరో ద్వారా అనేక మంది వధూవరులకు వివాహాలు జరిపించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ సురేష్ షట్కార్ మాట్లాడుతూ, ఈ వివాహ వేదిక ద్వారా తమ కుటుంబంలో కూడా వివాహం జరగడం ఆనందంగా ఉందని తెలిపారు.అనంతరం పసారం శ్రీనివాస్ దంపతులను సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం తరఫున ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సమాజ పెద్దలు, రెవెన్యూ జిల్లా మాజీ అధ్యక్షులు శివప్రసాద్, జిల్లా సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాష్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి శారద శివకుమార్, మీర్‌పేట్ సమాజ అధ్యక్షులు శరుణ్, శివశరణప్ప తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన దంత వైద్య సేవలకు ప్రతిష్ఠాత్మక అవార్డు

**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ విడిఓస్ కాలనీ లో ఉన్న శ్రీ శ్రీనివాసం డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మొరిశెట్టి ప్రదీప్ కుమార్, డాక్టర్ ఎం. ప్రియాంకలకు అధునాతన దంత వైద్య సేవలలో విశిష్ట సేవలందించినందుకు ప్రతిష్ఠాత్మకమైన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ అడ్వాన్స్డ్ డెంట్ హిస్టరీ అవార్డు లభించింది.హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో శనివారం నిర్వహించిన ఇండియన్ హెల్త్ సుమింట్ 2026 కార్యక్రమంలో ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వార్తా సంస్థ టైమ్స్ నవ్ నెట్ వర్క్ నిర్వహించింది. కార్యక్రమంలో ప్రముఖ ఆంకాలజిస్ట్ డా. నోరి దత్తాత్రేయుడు, కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ బొల్లినేని భాస్కర్ రావు, తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ కుమార్, డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అధునాతన దంత వైద్య




సేవలను ఖమ్మం జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. డిజిటల్ స్మైల్ డిజైనింగ్, డెంటల్ లేజర్ చికిత్సలు, డెంటల్ ఇంప్లాంట్స్ ట్రీట్మెంట్స్ వంటి ఆధునిక సేవలను ఖమ్మంలోనే అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, అత్యాధునిక హై టిరో లూమినా ప్రా కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగిస్తూ, చికిత్స అనంతరం చిరునవ్వు ఎలా ఉండబోతుందో ముందుగానే ఫోటోలు, వీడియోల రూపంలో చూపించే సదుపాయాన్ని పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.తమ సేవలను గుర్తించిన టైమ్స్ నవ్ నెట్ వర్క్ ఈ




ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రదానం చేయడం గర్వకారణమని, అధునాతన దంత వైద్య సేవల రంగంలో ఈ గుర్తింపు పొందిన తెలంగాణ జిల్లాలలో తొలి డెంటల్ సెంటర్‌గా శ్రీ శ్రీనివాసం డెంటల్ హాస్పిటల్ నిలవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.

## పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా యోగా వేడుకలు

**ఖమ్మం, నేటి శుభోదయ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా యోగా వేడుకలు నిర్వహించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్ లో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి సామూహికంగా యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణ, విధుల్లో



ఉండే పోలీసులకు యోగా వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిత్యం యోగా సాధన చేయడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్,నాగుల్ మీరా, యోగ ఉపాధ్యాయులుకూచన సుష్మిత, తోకచిచ్చు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నీట్-యూజీ 2026 పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, నేటి శుభోదయ :** వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించే నీట్-యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్త్, భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి, పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 అంక్షాలు అమలులో ఉంటుందన్నారు.శాంతి నగర్ కాలేజ్ సందర్శించిన పోలీస్ కమిషనర్ టౌన్ ఏసీపీ రమణమూర్తి కి పలు సూచనలు చేశారు.

## సీసీ రోడ్లకు శంకుస్థాపన



**ఖమ్మం, నేటి శుభోదయ :** కామంచికల్ గ్రామ పంచాయతీ ముత్యాల గూడెం గ్రామంలో 8వవార్డ్ లో ఆదివారం సర్పంచ్ బొప్పి ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొప్పి మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గ్రామంలో మట్టి రోడ్లు లేని గ్రామంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగనబోయిన సావిత్రి, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు జంగాల ఉపేందర్, బిఆర్ఎస్ నాయకులు లింగనబోయిన బాబు, గ్రామ కాంగ్రెస్ నాయకులు జంగాల రామారావు, సిపిఐ నాయకులు జంగాల పెద్ద ఉపేందర్, గ్రామ పెద్దలు మెదరమెట్ల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## వాన కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**వైరా, నేటి శుభోదయ :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ శుభ్రత పనులను మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ పరిశీలించారు. వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీలలో పేరుకుపోయిన మురుగు తొలగింపు పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమలు, వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను డ్రైనేజీలలో వేయకుండా సహకరించాలని కోరారు. వర్షాకాలంలో వార్డులో చెత్తాచెదారం లేకుండా చూడాలని తడి చెత్త పొడి చెత్తను మున్సిపాలిటీ వ్యాన్లో పడవేయాలని ఆమె సూచించారు డెంగ్యూ వ్యాధులు రాకుండా ప్రజల అప్రమత్తంగా ఉండి పరిసరాలను శుభ్రపరుచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. 20వ వార్డులో ఉన్న కౌన్సిలర్లు ఆయా అవార్డుల్లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచే విధంగా వార్డు జవాన్ల ద్వారా సమస్యలను పరిష్కరించాలని వర్షాకాలంలో వార్డుల్లో ప్రతి కౌన్సిలర్ పర్యటించాలని ఆమె తెలిపారు.

# స్నేహ సొసైటీ లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ :** మానసిక దివ్యాంగులు ,అంద విద్యార్థులైనప్పటికీ యోగాసనాలు వేసిన తీరు ఎంతో అబ్బురపర చాయని పలువురు వక్తలు కొనియాడారు.ప్రతి మనిషికి ఆరోగ్య సంరక్షణలో యోగ చాలా కీలకమని వారు తెలిపారు.ఇంతమంది మానసిక దివ్యాంగ విద్యార్థుల ఉన్నతికి యోగ దోహదపడుతుందని గుర్తించి శిక్షణనివ్వడం అభినందించదగ్గ విషయం అన్నారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా మానసిక దివ్యాంగులు,అంద విద్యార్థులు యోగాసనాలు వేశారు.ఈ యోగాసనాలను తిలకించిన ప్రముఖులు ధారం గంగాధర్,రామ్ కిషన్ రావు,నగేష్ గురుస్వామి,ఎక్స్ సర్వీస్ మెన్ పోతన్నలు మాట్లాడుతూ....నిత్య జీవితంలో యోగా ఎంతో కీలకమన్నారు.ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక శారీరక ప్రశాంతత కోసం యోగా పాత్ర కీలకమన్నారు.ఈ యోగాసనాల విశిష్టత గురించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలియపరచినప్పటికీ కూడా చాలామంది సకలాంగులు యోగాసనాలు వేయకుండా అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కానీ స్నేహ సొసైటీ దివ్యాంగ పాఠశాలలో మానసిక దివ్యాంగ విద్యార్థుల వారి ఆరోగ్య రీత్యా,ఉన్నతికి యోగ అతి ముఖ్యమని గుర్తించి స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి,కార్యదర్శి సిద్దయ్యలు ప్రత్యేకంగా యోగా ఉపాధ్యాయురాలు వీణ ద్వారా విద్యార్థులకు యోగాసనాలు వేయించడం ఎంతో అభినందనీయమన్నారు.అలాగే ఇప్పటికీ 72 సంవత్సరాలు గడిచినప్పటికీ యోగాసనాలు నిత్యం వేయడం జరుగుతుందని రాంకిషన్ రావ్,దారం గంగాధర్ లు తెలియపరిచారు.ప్రతి ఒక్కరు నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక శారీరక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దారం గంగాధర్,పోతంగల్ రామ్ కిషన్ రావు,నగేష్ గురుస్వామి,ఎస్.సిద్దయ్య కార్యదర్శి స్నేహ సొసైటీ,సాయినాథ్ స్వామి,పోతన్న ఎక్స్ సర్వీస్ మెన్,తాటి వీరేశం,సుధాకర్ రెడ్డి,ప్రిన్సిపాల్ జ్యోతి,ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మానసిక దివ్యాంగులు వివిధ రకాలైన ఆసనాలను ప్రోటోకాల్ ప్రకారం వేయడం జరిగింది.

# ఖమ్మం అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష చేపట్టాలి - పొంగులేటి సుధాకర్ రెడ్డి

**ఖమ్మం, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో అమలవుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై, ప్రత్యేకించి బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ సహ ఇన్‌ఛార్జి (కర్ణాటక, తమిళనాడు) డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రం (లేఖ) సమర్పించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో కలిసి పనిచేస్తామన్న ముఖ్యమంత్రి వైఖరిని తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా తన స్వస్థలం అని, జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం తన నైతిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ముఖ్యమంత్రి నాయకత్వంలో సమీక్ష నిర్వహిస్తే పెండింగ్ అంశాలు పరిష్కారమై జిల్లా అభివృద్ధికి సరికొత్త దిశ లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన కింద బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసి విడుదల చేసిందని సుధాకర్ రెడ్డి గుర్తుచేశారు. రైతుల ఉత్పత్తులకు విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకురావడం, ఆధునిక ఫుడ్ ప్రాసెసింగ్ మౌలిక వసతుల కల్పన, యువతకు ఉపాధి కల్పన, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు ఖమ్మం జిల్లా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించామని, కాబట్టి కేంద్రం నిధుల విడుదల, వినియోగం, భౌతిక మరియు ఆర్థిక పురోగతి, ప్రస్తుత మౌలిక వసతుల స్థితిగతులు, ప్రత్యక్ష పరోక్ష ఉద్యోగాలపై సమీక్షలో ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన కోరారు. ఉపాధి పొందిన స్థానిక యువత వివరాలతో పాటు ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమల సంఖ్యను కూడా బేరీజు వేయాలని ఆయన సూచించారు.గత ఏడాది డిసెంబర్ 2025లో రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమీక్ష సమావేశంలో బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌లో దీపక్ నెక్స్ట్ జెన్ ఆక్వా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.615 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు చేసిన ప్రకటనను ఆయన లేఖలో ప్రస్తావించారు. ఈ ప్రకటన యువతలో విశేష ఆశలు రేకెత్తించిందని, అయితే పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న కంపెనీ వార్షిక నివేదికల ప్రకారం ఆ సంస్థ సంబంధిత ఆర్థిక సంవత్సరంలో కేవలం సుమారు రూ.22 కోట్ల టర్నోవర్‌ను మాత్రమే నమోదు చేసిందని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రూ.615 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను ప్రభుత్వం ఏ ప్రాతిపదికన పరిశీలించింది, సంస్థ ఆర్థిక సామర్థ్యంపై సాంకేతిక పరిశీలన జరిగిందా, బ్యాంకు మద్దతు తదితర వివరాలను సమీక్షలో నివృత్తి చేయాలని ఆయన కోరారు. పెట్టుబడి ప్రతిపాదనల ప్రస్తుత స్థితి, కేటాయించిన భూమి, కల్పించిన ఉద్యోగాలు, వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించే అంచనా తేదీలను ప్రజల ముందు ఉంచాలన్నారు. ఈ ప్రశ్నలు ఎవరిపైనా ఆరోపణలు చేయడానికి కాదని, ప్రజల డబ్బుతో అమలవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుపై పూర్తి పారదర్శకత ఉండాలన్నదే తన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.ప్రజల్లో పూర్తి విశ్వాసం నెలకొనేలా బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని పొంగులేటి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, జరిగిన వ్యయం, మౌలిక వసతుల పురోగతి, ప్లాట్లు కేటాయించిన పరిశ్రమలు, మొత్తం పెట్టుబడులు, కల్పించిన ఉద్యోగాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల వివరాలు శ్వేతపత్రంలో పొందుపరచాలని ఆయన సూచించారు. దీనితో పాటు ఖమ్మం జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న జాతీయ మరియు గ్రామీణ రహదారులు, రైల్వేలు, గృహ నిర్మాణ పథకాలు, తాగునీరు, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధి, గ్రామీణ ఉపాధి, విద్య, వైద్యం మరియు పట్టణాభివృద్ధి రంగాలపై కూడా సమగ్ర సమీక్ష జరపాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా ప్రజలకు రాజకీయాలు కాకుండా అభివృద్ధి మాత్రమే ముఖ్యం అని, కేంద్రం మంజూరు చేసిన ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలని, ప్రతి ప్రాజెక్టు సకాలంలో పూర్తయి అర్హుడైన యువకుడికి ఉద్యోగం దక్కాలని ఆయన ఆకాంక్షించారు. మంత్రుల సమక్షంలో ఈ సమీక్ష జరిగితే జిల్లా ప్రగతికి అది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**చింతూరు, నేటి శుభోదయ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపల్ జి.వెంకట్రావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు పి. చంద్రశేఖర్, పి.రాము ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యం కోసం మనం వెలకట్టలేని ఔషధం యోగా అని, మనిషి దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొంత సమయాన్ని వెచ్చించలేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతిరోజు యోగాసనాలు చేయ డం ద్వారా ఆరోగ్యంగాను, ఉల్లాసంగాను ఉత్సాహంగాను ఉంటామ ని ఇప్పటి నుంచైనా విద్యార్థులందరూ ప్రతిరోజు 30 నిమిషాలు యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లిశేఖర్, యోగ ట్రైనర్ ఆర్.మౌనిక, డా. వై.పద్మ, డా.కె. శకుంతల, జి.హారతి, ఎస్. అప్పనమ్మ, కె.శైలజ, బి. శ్రీనివాసరావు, ఎన్. ఆనంద్, కె.లక్ష్మీ ప్రసన్న, ఆర్.కిరణ్మయి, వి.శీనయ్య, ఎన్. కన్నయ్య, పి.రంగమ్మ, మంగయ్య, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ రాష్ట్రాన్ని ఆకలి రాష్ట్రంగా చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- మంత్రుల మాటలతో అయోమయానికి గురవుతున్న రైతులు
- రైతులు వేసే ఏ సన్నరకం వరిపంటనైనా కొనుగోలు చేయాల్సిందే
- కాంగ్రెస్ పార్టీ అంటేనే అన్నదాతల ఆత్మహత్యలు...ఆకలి..చీకటి
- దేవుని మీద ఒట్లు వేయడంతోనే ప్రకృతి కూడా సహకరిసలేదు
- మీటింగ్‌లకు పెట్టే ఖర్చులతో రైతు బంధు అమలు చేయచ్చు
- మార్పు పేరుతో రైతుల జీవితాలను ఛిద్రం చేస్తున్న రేవంత్‌రెడ్డి
- ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**మంథని, కూసుమంచి, నేటి శుభోదయ :** పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నపూర్ణగా మారిన తెలంగాణ రాష్ట్రాన్ని ఆకలి రాష్ట్రంగా మారుస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అన్నమో రామచంద్రా ఏందీ మా బతుకులు అనే దుస్థితిలోకి తీసుకువచ్చారని ఆయన వాపోయారు. మార్పు అనే పదం వాడి రైతుల జీవితాలను పూర్తిగా శిథిలం చేసి అనేక మంది రైతుల కుటుంబాలను రోడ్డు పాలు చేశారని, కాంగ్రెస్ అంటేనే ఆత్మహత్యలు, కాంగ్రెస్ అంటేనే ఆకలి..చీకటి అనే పరిస్థితులకు తీసుకురావడం స్పష్టంగా చూస్తున్నామని ఆయన వివరించారు. నేను దొంగను నా పెరుగులదలనే మోసాలు చీటింగ్ అని రేవంత్ రెడ్డి మనకు చెప్పి మోసం చేశాడని ఆయన అన్నారు. 50లక్షల నోట్ల సంచులతో దొరికిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అమెరికా వెళ్లిన రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల కరెంటు అక్కర లేదు మూడు గంటలు సరిపోతదని టెన్ హెచ్‌పీ మోటార్లు పెట్టుకుంటే పంటకు సరిపడా నీళ్లు అందుతాయని చెప్పాడని గుర్తు చేశారు. సీఎం అన్న మాట ప్రకారం మళ్లీ 24గంటల కరెంటు తీసివేయడానికి రైతు డిస్కంలు తీసుకువచ్చిండన్నారు. అలాగే పంటకు బీమా కడుతానని చెప్పి ఉన్న రైతుభీమను తీసివేశాడని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా 7600మంది రైతులు చనిపోతే ఆ కుటుంబాలకు రైతుబీమా రాకుండా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు అన్ని పంటలకు బోనస్ ఇస్తమని చెప్పి అసెంబ్లీలో 33రకాలు మాత్రమే సాగు చేసుకోవాలని మాట్లాడి బయటకు వచ్చినంక ఏడు రకాలే అంటున్నారని, ఆ ఏడు రకాలు దిగుబడి తక్కువగా వస్తయ్ కనుకనే సాగు చేసుకోమంటున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సైతం హద్దు అదుపు లేకుండా సిగ్గు లజ్జ లేకుండా మాట్లాడుతున్నారని, ఓ మంత్రి 33రకాలు అంటే మరో మంత్రి ఏడు రకాలంటూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి పదే పదే దేవుని మీద ఒట్లు వేస్తుండటంతో ఈ సర్కార్‌లో ప్రకృతి కూడా సహకరించడం లేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడిన వీడియోలు కనబడుతున్నాయని, ఆడియోలు వినబడుతున్నా కూడా ఇంకా అబద్దాలు ఆడుతూనే ఉన్నారని అన్నారు. ఇంత అబద్దాలు ఆడేవాళ్లు ప్రపంచంలో ఎవరూ లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే దగా మోసమని, ఏనాడు ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచన చేయలేదని ఆయన అన్నారు. ఆనాడు వడ్లు కొనకపోతే ఎందుకు ఉన్నవ్ అని కేసీఆర్‌ను అన్నాడని, మరి ఈనాడు వడ్లు మక్కలు శనిగలు కూడా కొనడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా తీసుకువచ్చి ఎవరైనా మాట్లాడితే ఇళ్లు కూలగొడుతమంటూ బెదిరిస్తున్నారని అన్నారు. రైతుల నుంచి కొన్న పంటను విదేశాలకు ఎగుమతి చేస్తానని అన్న ముఖ్యమంత్రి మళ్లీ పంట మార్పిడి అంటూ రైతులను దగా చేస్తున్నాడని, రైతులకు వెసులుబాటు ఉన్న సన్నరకం వేసుకుంటే ఆ పంటను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి మాట్లడినట్లు వడ్లు కొనకపోతే గద్దె మీద కూర్చుండే అర్హత లేదన్నట్లుగా ఈసారి రైతులు ఏ సన్నరకం వడ్లు సాగు చేసినా కొనుగోలు చేయాలని లేకపోతే గద్దె మీద కూర్చుండే అర్హత రేవంత్‌రెడ్డికి లేదన్నారు. మార్పు పేరుతో రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో 2028వరకు ప్రజలు ఆగే పరిస్థితిలోలేరని, రైతులే కాకుండా యావత్తు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇచ్చిన ఒక్క హమీని అమలు చేయకుండా ఆస్తులు సంపాదించుకుంటున్నారని, ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ దోపిడికి పాల్పడుతుండ్లని ఆయన ఆరోపించారు. పంటల సాగులో రైతులు నిబంధనలు పాటించరని, రైతులు పండించే సన్నరకాలను కొనుగోలు చేయాల్సిందనని ఆయన డిమాండ్ చేశారు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించినట్లుగా 33రకాల సన్నాల ప్రభుత్వం ఖచ్చితంగా కొనుగోలు చేయాలని, లేకపోతే కల్లాల వద్దకు వస్తామని, ఎట్లా కొనుగోలు చేయరో చూస్తామన్నారు. రైతుబందు పథకం డబ్బులు వేసేందుకు సభలు పెట్టి వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఆ డబ్బులతో రైతుబంధు వేయవచ్చని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళ్లు తెరువాలని, మీ సోషల్ మీడియాలో ఉన్న వీడియోలు చేసైనా మార్పు తెచ్చుకోవాలని సూచించారు.

# జయశంకర్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న దుద్దిళ్ల శ్రీను బాబు



**మంథని, నేటి శుభోదయ** మంథని పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయుడు ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ వర్ధంతి కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.తెలంగాణ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య జయశంకర్ గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీను బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇందూరు...యోగా గురువులకు నిలయం



**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ :** ఇందూరు జిల్లా యోగా గురువులకు నిలయమని, అనేకమంది విద్యార్థులు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.భారతీయ జనతా పార్టీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....యోగా అంటే శరీర వ్యాయామం కాదని జీవన విజ్ఞానం అన్నారు.వ్యక్తిత్వం ఆలోచన విధానం సమాజం ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా యోగ బలపరుస్తుందన్నారు.ప్రతి ఒక్కరూ నిత్యం యోగా కోసం సమయం కేటాయించాలన్నారు.ప్రధానంగా యోగా సాధన ద్వారా సహనం క్రమశిక్షణ పరస్పర గౌరవం వంటి విలువలు పెరుగుతాయి అన్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ,ఫ్లోర్ లీడర్ ప్రమోద్,కార్పోరేటర్లు జగదీష్ కులకర్ణి,చింతకాయల రాజేందర్,మల్కాయి మహేందర్,సీనియర్ నాయకులు న్యాలం రాజు,ఇప్పకాయల కిషోర్,మురళీ,బొబ్బిలి వేణు,శ్రీనివాస్, ఇల్లెందుల ప్రభాకర్, కృష్ణ, బి.శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కో– కోశాధికారి విజయ్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - నూతి సత్యనారాయణ గౌడ్



**వైరా, నేటి శుభోదయ:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఎన్ వి ఎస్ గార్డెన్లో జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారధ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన గ్యారంటీ పథకాలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసి చూపించారని అన్నారు. పేదల కోసం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు మహిళలకు ఉచిత బస్సు వడ్డీ లేని రుణాలు రైతులకు రైతు రుణమాఫీ రైతు భరోసా భీమా పథకం ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకం మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయల ఖర్చుతో సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులు అందించారని అన్నారు. ఈనెల చివరి వారంలో మధిర నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉంటుందని తెలిపారు. ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే మహిళ నారి శక్తి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వైరా నియోజకవర్గ కేంద్రంలోని వైరా మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మా రోశయ్య, జిల్లా నాయకులు రంగా జనార్ధన్, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, వేముల రత్నాకర్, బి కే నాయక్, చిత్తారి శ్రీనివాస్, రాచ బంటి రామకృష్ణ, నంబూరి ఓంకార్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 26న తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి : అనంతుల లక్ష్మీనారాయణ

**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం (టిపియుఎస్) అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో గల స్వకులశాలి సమాజ భవనంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు అనంతుల లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ఉద్యోగుల సంక్షేమం, పద్మశాలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, సంఘం భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలి ఉద్యోగులు ఒకే వేదికపై సమావేశమై పరస్పర అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సంఘ బలోపేతానికి ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని పద్మశాలి ఉద్యోగు లందరూ పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో దూలం నటరాజ్, గొట్టిముక్కుల మహేందర్, పసునూతి వెంకటేశ్వర్లు, కొండి పద్మజ, పుట్ట లింగమూర్తి, దిగిదారి రాము తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగానే మార్గం

**కేశంపేట, నేటి శుభోదయ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక పరిగి రోడ్ సత్యనారాయణ స్వామి టెంపుల్ గ్రౌండ్‌లో యోగా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ నాయకత్వంలో కుంగ్ ఫు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగా ఆసనాలు ప్రదర్శించారు.ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, యోగా భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన గొప్ప జీవన విధానమని అన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా అత్యంత అవసరమని పేర్కొన్నారు.యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంతో పాటు సంతోషకరమైన జీవితం గడపవచ్చని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే గొప్ప వేదికగా నిలుస్తోందని పేర్కొంటూ మండల ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ "సర్" బూత్ లెవెల్ ఏజెంట్ శిక్షణ సమావేశం

**వైరా, నేటి శుభోదయ :** వైరా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంపై స్థానిక కమ్మవారి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం పది గంటలకు బి ఆర్ఎస్ ముఖ్య నాయకుల కోఆర్డినేటర్లు బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సర్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ఆర్ జె సి కృష్ణ ఆదివారం వైరా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షులు తాత మధుసూదన్ , రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాల్గొంటారని అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పెషల్ ఎంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓట్లను తొలగించే ప్రక్రియ కొనసాగిస్తుందని దీన్ని అడ్డుకునేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోదీనినిఎండగడతామని అన్నారు. దేశ వ్యాప్తంగా బిజెపి అధికారంలో లేని రాష్ట్రాల్లో సర్ పేరుతో ఓట్ల తొలగింపు కొనసాగిస్తున్నారని దీనిని ప్రతి ఒక్క కార్యకర్త ఓటర్ వద్దకు చేరేటట్లు సమాచారాన్ని ఇవ్వాలని అన్నారు. నేడు జరగనున్న బూతు లెవల్ ఏజెంట్లు కోఆర్డినేటర్లు నూతనంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు వైరా నియోజకవర్గ వ్యాప్తంగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జునరావు, లకావత్ గిరిబాబు, బానోత్ బాలాజీ నాయక్, మనీషా లక్ష్మి , లకావత్ గిరిబాబు, మాదినేని ప్రసాద్, అప్పం సురేష్, ఏదునూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# వృక్ష సంపదను పెంపొందిద్దాం

**వైరా, నేటి శుభోదయ :** వైరా మండలంలోని పాలడుగు గ్రామ శివారులోని ఆదివారం వివిధ ప్రాంతాల్లో, స్థానిక సర్పంచ్ గద్దల నరసింహారావు చేతుల మీదుగా 10 వేల ఇప్ప గింజలను నాటారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడారు. ప్రస్తుతం కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకట్ట వేయకుంటే, భావితరాలకు విషాదం మిగిల్చిన వారమవుతామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్లాస్టిక్ వాడినా, అట్టి వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేసి ప్రకృతి, పర్యావరణాన్ని పాడుచేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఒక్కరు ఈ ప్రకృతి, పర్యావరణం తమ సొంతమని భావించి, వాటి పరిరక్షణకు నడుంకట్టాలన్నారు. అందుకోసం అందరు గింజలు, మొక్కలను నాటి వృక్ష సంపదను పెంపొందించాలని కోరారు. ఎన్నో ఉపయోగాలు ఉన్న ఇప్ప చెట్లను మైదాన ప్రాంతాలకు విస్తరించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. ఎవరైనా రైతు సోదరులు తమ తమ పొలాల్లో ఇప్ప చెట్లను పెంచాలను కునేవారికి ఉచితంగా విత్తనాలు అందిస్తామన్నారు. వృక్షో రక్షితి రక్షితహా: చెట్లను మనం కాపాడితే, చెట్లుతిరిగి మనలనుకాపాడుతాయి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కో.ఆప్షన్ సభ్యులు ఎస్.కె మహమ్మద్ ఖాసీం, వనమా హరిబాబు, కాకాని రాధా కుమార్, సైదు బాబు, రఫీ, విశ్రాంత ఉపాధ్యాయులు, సిపిఎం సీనియర్ నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, మోదుగు వెంకటేశ్వర్లు, విరుపార్శపు రామచంద్రయ్య, అబ్దుల్ మజీద్, మేడగాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట, నేటి శుభోదయ :** కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన శ్యామల సాయి కిరణ్ ఇటీవల శ్రీశైలం వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నరసింహులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.అనంతరం అంత్యక్రియలు మరియు ఇతర అత్యవసర ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజలు కూడా మృతుడి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మల్లేష్, చంద్రయ్య, గ్రామస్తులు మనోహర్ గౌడ్, చిర్ర శ్రీను, ఆనంద్ రెడ్డి, చిర్ర రాజు, కటికే రమేష్, కటికే యాదయ్య, జరుపల నరసింహులు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.



సోమవారం | హైదరాబాద్
22 - 06 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ ప్రతి క్షణం - ప్రజల కోసం తెలుగు దినపత్రిక



# రైతుకోసం పంతులయ్య అడుగులు

## - తుమ్మలకు భూవరాహ యజ్ఞఆహ్వానం



**భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి :** నేటి శుభోదయ:కల్ప వృక్ష నారసింహస్వామి వారి దివ్య సన్నిధిలో నృసింహ ఉపాసకులు డా. కృష్ణ చైతన్య స్వామి వారి ఆధ్వర్యంలో 32 దివ్య క్షేత్రాల నుండి తెచ్చిన మట్టికి 32 రోజుల కాలం ప్రత్యేక పూజలు చేసి జూన్ 25నుండి 27వరకు మూడు రోజుల కాలం పాటు భూ వరాహ యజ్ఞాన్ని నిర్వహించి ఆ మృత్తికాప్రసాదాన్ని రైతులకు అందించనున్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కి భువరాహయజ్ఞ ఆహ్వాన పత్రికను అందించి రైతు శ్రేయస్సు కోసం జరిగే యజ్ఞరాజానికి తప్పనిసరిగా రావాలని డా. కృష్ణ చైతన్య స్వామి వారు ఆహ్వానం పలికారు ఈ సందర్భంగా చైతన్య స్వామి మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటుందని గత పది సంవత్సరాలుగా ఏరువాక పౌర్ణమి నాడు రైతన్నలను సన్మానించి వారికి మృత్తికాప్రసాదాన్ని అందిస్తున్నామని అన్నారు ఈ మట్టి ప్రసాదాన్ని పంట పొలాలలో చల్లడం ద్వారా సమృద్ధిగా పంటలు పండుతాయని అన్నారు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడవు పంటలు పండవు అని ఎంతో మంది రైతులు లేని పోని అపోహలతో ఇప్పటికే ఆలోచనలో పడ్డారని అందుకే లోకానికి అన్నం పెట్టే రైతన్న సుభిక్షంగా ఉండాలనే మహా సంకల్పంతో చేస్తున్న ఈ భూవరాహ యజ్ఞంలో ప్రతి ఒక్క రైతు పాల్గొని స్వామివారి దివ్య సన్నిధిలో ఇచ్చే మృతిక ప్రసాదాన్ని స్వీకరించి తమ తమ పంట పొలాలలో జల్లుకొని సిరుల పంటలు పండించుకుని రైతన్నలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు గత 10 సంవత్సరాలుగా ఏరువాక పౌర్ణమి నాటికి కొన్ని వేల మంది రైతులు ఆ మట్టి ప్రసాదాన్ని తమ తమ పంట పొలాలలో జల్లుకుని ఎంతో వృద్ధిలోకి వచ్చారని ఈ సంవత్సరం లక్ష మంది రైతులకు ఆ మృత్తిగా ప్రసాదాన్ని అందించనున్నామని అన్నారు ఇంతటి మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన డా. కృష్ణ చైతన్య స్వామికి రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నృసింహ ఉపాసకులు డా. కే.కృష్ణ చైతన్య స్వామి టి పి సి సి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు రైతులు తదితరులు పాల్గొన్నారు

# నీట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్




**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ :** కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిజామాబాద్ జిల్లాలో ఆదివారం నీట్ పరీక్షను సాఫీగా నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేసి,నీట్ ఎగ్జామ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు.అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు.సీ.సీ.కెమెరాలు పని చేస్తున్నాయా అన్నది గమనించిన కలెక్టర్,వాటి ఫుటేజీల ఆధారంగా నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా?లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు.బయో-మెట్రిక్ హాజరు సేకరణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.కాపీయింగ్,పేపర్ లీక్ కు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల వద్ద ఏర్పాటు చేసిన జామర్ లను,తాగు నీటి వసతి,ప్రథమ చికిత్స వసతులతో కూడిన ఏ.ఎన్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు.అభ్యర్థుల అడ్మిట్ కార్డు,ఆధార్ వంటి గుర్తింపు కార్డులతో సరిచూసుకున్న మీదటే,మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించడం జరిగిందని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.ఎగ్జామ్ హాల్లోకి సెల్ ఫోన్లు,స్మార్ట్ వాచ్,ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లలతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు.కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ,అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఎన్.టీ.ఏ నిర్దేశించిన నిబంధనలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ,ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్ష జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు.పరీక్ష సమయం ముగిసేంత వరకు ఎవరు కూడా బయటకు వెళ్లకుండా చూడాలని,ఆన్సర్ షీట్స్,ఎగ్జామ్ మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ కు చేరుకునే వరకు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.కాగా,జిల్లాలో నీట్ పరీక్షకు 86.55 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు.మొత్తం 3459 మంది అభ్యర్థులకు గాను 2994 మంది పరీక్ష రాయగా,465 మంది గైర్హాజరయ్యారని వివరించారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగానే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో,సజావుగా నీట్ పరీక్షలు జరిగాయి.కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఆయా రూట్ల వారీగా ప్రశ్న పత్రాలు,ఇతర సామాగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు.అన్ని కేంద్రాల వద్ద 164 (బీ.ఎన్.ఎస్) నిషేధాజ్ఞలు అమలు చేస్తూ,జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

# భద్రాచలంలో రెండు స్కూటీల్లో 9.7 కేజీల ఎండు గంజాయి పట్టివేత



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :** భద్రాచలంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో రెండు స్కూటీల్లో అక్రమంగా తరలిస్తున్న 9.7 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జె. గణేష్, ఈఎస్ కె. తిరుపతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ సి.హెచ్. శ్రీహరి రావు ఆధ్వర్యంలో సిబ్బంది భద్రాచలం పాత ఆర్టీఏ కార్యాలయం సమీపంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్ ఎదుట వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని సుజుకి బర్గ్‌మ్యాన్ స్ట్రీట్ స్కూటీని తనిఖీ చేయగా 5.2 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని కలిమెల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న మహమ్మద్ ఖాన్, షేక్ షోయబ్‌లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వారి వెనుక వస్తున్న టీవీఎస్ జూపిటర్ స్కూటీ (టీజీ 15 జే 4342)ని తనిఖీ చేయగా మరో 4.5 కిలోల ఎండు గంజాయి స్వాధీనం అయింది. ఈ గంజాయిని ఒడిశాలోని మోటు ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న మోహిత్ కుమార్ యాదవ్‌ను అదుపులోకి తీసుకోగా, ఆనంద్ కుమార్ మిశ్రా పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.మొత్తం 9.7 కిలోల ఎండు గంజాయి, రెండు స్కూటీలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాటి విలువ సుమారు రూ.6.60 లక్షలుగా అంచనా వేశారు. తదుపరి విచారణ నిమిత్తం స్వాధీనం చేసిన వస్తువులను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు శివకుమార్, వీరబాబు, తిరుపతి, ఉపేందర్, డ్రైవర్ సాయికుమార్ పాల్గొన్నారు.మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800-425-2523కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్‌ఐ సి.హెచ్. శ్రీహరి రావు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మల్లి బాబు యాదవ్, ఏసిపి నందిరాం నాయక్



**కామేపల్లి, నేటి శుభోదయ :** కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ సోదరుడు బానోతు లచ్చిరాం – బుజ్జి ల కుమారుడు సురేష్ –సంధ్య ( కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన లకావత్ కిషన్ –జ్యోతి ల కూతురు ) వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ – అర్చన దంపతులు పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి, చల్లగా అన్యోన్యంగా జీవితాంతం గడపాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, పిఏసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు, ఆరెం రవి,దేరంగుల తిరపయ్య గుగులోతు కిషన్, బానోతు శ్రీను భూక్యా రవి, భూక్యా వీరన్న, బానోత్ వెంకన్న, బానోతు లక్ష్మ, రాయల నాగ శంకర్ భానోత్ నరసింహ నాయక్, బాదావత్ నాగరాజు, బానోత్ వీరనాగులు ధరావత్ రాములు,చంద్రరావు ఉపేందర్ రావు ముత్యాల సత్యనారాయణ, బంధువులు పాల్గొన్నారు.

# 12 వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ :** ఆదివారం నూతన కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమంలో నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణ గుప్తా ముఖ్య అతిధిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసినట్లు జిల్లా ఆయుష్ యోగ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.గంగా దాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ....12 వ అంతర్జాతీయ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ,ప్రపంచంలోని 177 దేశాలలో యోగ కార్యక్రమాలు జరుగుతున్నాయని,యోగ సాధన ద్వారా వ్యాధులు రాకుండా,ప్రతి ఒక్కరూ వయసుకు సంబంధం లేకుండా యోగ చేయడం చక్కని పరిష్కారం అని తెలిపారు.ఆయుష్ అధికారి మాట్లాడుతూ..నూతన కలెక్టర్ గ్రౌండ్ లో జరపడం,దీనిలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు.తరువాత విద్యార్థులు చేసిన యోగ విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే మెమెంటో లు అందచేసి,ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్ని ఆర్గనైజేషన్ ల వారికి శాలువాతో సన్మానం చేసి మెమెంటో లు అందచేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా యూత్ ఆఫీసర్ రమేష్,యోగ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రాంచందర్,అధ్యక్షులు ప్రభాకర్, రెడ్ క్రాస్ ప్రతినిధులు తోట రాజశేఖర్,ఆంజనేయులు,డిఎస్డిఓ పవన్,సిఐ శ్రీనివాస్,లయన్స్ క్లబ్ ప్రతినిధి కరిపే రవీందర్,డిప్యూటీ డిఎంహెచ్ఓ,యోగ గురువులు సంగీత,సిద్ధిరములు,బాలశేఖర్,ఆయుష్ వైద్యులు శ్రీవాణి, ఫాసియుద్దీన్, తిరుపతి, వెంకటేష్, ఆయుష్ డీపీఎం వందన,ఆయుష్ ఫార్మా సిస్ట్స్ లు ఆయుష్ పురుషోత్తం,ఉమప్రసాద్,జిల్లాలోని ఆయుష్ వైద్యులు, స్టాఫ్, స్థానిక కోర్పొరేటర్,ఆరోగ్య శాఖ వెంకటేశ్వర్లు,యోగ సాధకులు, మహిళలు, నర్సింగ్ విద్యార్థినిలు, వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సాధకులకు రెడ్‌క్రాస్ తరపున రాగి అంబలి,రిలయన్స్ సంస్థ వారు అరటి పండ్లు,వాటర్ బాటల్స్,అల్ట్రాటెక్ సిమెంట్ వారు పండ్ల రసాలు,మంచి నీళ్లు అందచేసినందుకు ఆయుష్ శాఖ తరపున అభినందనలు తెలిపారు.

# నగర పాలక సంస్థలో సంపూర్ణంగా స్పెషల్ డ్రైవ్

- **డీసిల్టింగ్ పనులు 75శాతం పూర్తి**
- **కమిషనర్ దిలీప్ కుమార్ వెల్లడి**




**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ :** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్ నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులను చక్కదిద్దేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదివారం తెలిపారు.ఈ నెల 10వ తేదీ నుండి స్పెషల్ డ్రైవ్ ను ప్రారంభించడం జరిగిందని,ప్రతి రోజు సగటున రెండు నుండి మూడు డివిజన్లలో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు.ఆయా డివిజన్లలో అర్బన్ ఎమ్మెల్యే,నగర మేయర్,డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు,ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని అన్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలోని సానిటేషన్ కార్మికులు సుమారు వంద మంది చొప్పున సామూహికంగా పారిశుధ్య పనులను చేపట్టడం వల్ల ఆయా డివిజన్లలో సానిటేషన్ పనులు పెద్ద ఎత్తున చేపట్టగలిగామని తెలిపారు.డ్రైనేజీలు,రోడ్లను శుభ్రం చేయడం,చెత్తను తరలించడం,పిచ్చి మొక్కలు,ముళ్ళ పొదలను శుభ్రం చేయడం వంటి పనులు అన్ని డివిజన్లలో పూర్తయ్యాయని అన్నారు.శుభ్రపరచిన మురుగును,చెత్తను నివాస ప్రాంతాల మధ్య నుండి వెంటదివెంట తరలించడం జరిగిందన్నారు.కలెక్టర్ చొరవతో పలు డివిజన్లలో శ్రమదానం కార్యక్రమాలు సైతం జరిగాయని అన్నారు. కాగా, వర్షాకాలంలో వర్షపు జలాలు నిలువ ఉండకుండా ఆయా నివాస ప్రాంతాలలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను కూడా వేగవంతంగా జరిపిస్తున్నామని కమిషనర్ తెలిపారు.వర్షాలు కురిసినప్పుడు వర్షపు జలాలతో చెత్తాచెదారం మురుగు కాలువల్లోకి చేరి,పూడిక వల్ల ముందుకు వెళ్లే అవకాశం లేక నగరంలోని పలు ప్రాంతాలు,ప్రధాన రహదారులు అపరిశుభ్రంగా మారే అవకాశం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా డీసిల్టింగ్ పనులు చేయిస్తున్నామని అన్నారు.అవకాశం ఉన్న చోట జేసీబీల ద్వారా,మిగితా చోట్ల పారిశుధ్య కార్మికులతో పూడికతీత పనులు జరిపిస్తున్నామని తెలిపారు.ఐదు జోన్ల పరిధిలో దాదాపు 23 కిలోమీటర్ల పొడవుతో కూడిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీలు ఉండగా,రూ.68.96 లక్షల రూపాయల అంచనా వ్యయంతో డీసిల్టింగ్ పనులు కొనసాగుతున్నాయని,ఇప్పటికే17.22 కిలోమీటర్ల పొడవుతో కూడిన డ్రైనేజీల డీసిల్టింగ్ పూర్తయ్యిందని వివరించారు.మిగితా డీసిల్టింగ్ పనులను కూడా వారం పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

## కొత్తగూడెం, జగ్గయ్యపేట రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించండి

### - కూనంనేని సాంబశివరావు




**కొత్తగూడెం, నేటి శుభోదయ :** కొత్తగూడెం నుండి తల్లాడ మీదుగా జగ్గయ్యపేట వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలో రోడ్డు రవాణా, హైవేస్ కేంద్ర మంత్రి నితిన్ జైరాం గడ్కరిని, రాష్ట్ర రాజధానిలో రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి ఆయన లేఖలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు వంద కిలోమీటర్ల పొడవు కలిగి, కొత్తగూడెం (ఎన్ హెచ్-30) - వైరా - జగ్గయ్యపేట (ఎన్ హెచ్-65) లను అను సంధానించే ఈ రహదారి తెలంగాణలోని ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ, గిరిజన ప్రాంతాలను కలిపే వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన రాష్ట్ర రహదారి అని వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్ లాంటి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉండటం వల్ల ఇది ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఉందన్నారు. ఈ రోడ్డు పాల్వంచ, అశ్వాపురం, మణుగూరు లాంటి పారిశ్రామిక ప్రాంతాలను కలపడమే కాకుండా, అంతర్జాతీయ పుణ్యక్షేత్రమైన భద్రాచలం చేరుకోవడానికి భక్తుల మార్గాన్ని సులభతరం చేస్తుందని పేర్కొన్నారు. దీనిని జాతీయ రహదారిగా మార్చడం వల్ల తూర్పు, మధ్య తెలంగాణ మధ్య రవాణా మెరుగై, బొగ్గు రవాణా సులభతరమవుతుందని, గ్రామీణ ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. జగ్గయ్యపేట వద్ద ఎన్ హెచ్-65 కి అనుసంధానం కావడం ద్వారా ప్రధాన మార్కెట్లకు లింక్ ఏర్పడుతుందని, ప్రాధాన్యత ప్రాతిపదికన ఈ నవీకరణ పనులను చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులను అయన సమర్పించిన లేఖలో పేర్కొన్నారు.

## సైబరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల రైడ్స్

### ఓ రెస్టారెంట్‌కు సూపర్ మార్క్స్ మరో రెస్టారెంట్‌కు నోటీసులు




**మాదాపూర్, నేటి శుభోదయ :** ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సైబరాబాద్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు.ఇందులో భాగంగా శనివారం సీఎంసీ ఫుడ్ సేఫ్టీ బృందాలు కొండాపూర్,హైటెక్ సిటీ ప్రాంతాల్లోని ప్రముఖ రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి.ఈ తనిఖీల్లో ఓ రెస్టారెంట్ 92 శాతం మార్కులతో బెస్ట్ అనిపించుకోగా మరో రెస్టారెంట్‌లో నిబంధనల ఉల్లంఘనలు బయట పడటంతో అధికారులు నోటీసులు జారీ చేశారు.సత్తిబాబు బిర్యానీకి మార్కులు..కొండాపూర్‌లోని సత్తిబాబు బిర్యానీ రెస్టారెంట్ ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడించారు.హైజీన్ అసెస్‌మెంట్‌లో ఈ రెస్టారెంట్‌కు 92 శాతం మార్కులు లభించాయని పేర్కొన్నారు.ఫుడ్ హ్యాండ్లర్లు అందరూ హెయిర్‌నెట్స్,గ్లోవ్స్,ఏప్రాన్లు ధరించడంతో పాటు మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్,వాటర్ టెస్టింగ్ రికార్డులు పక్కాగా ఉన్నాయని వెజ్, నాన్-వెజ్ పదార్థాలను విడివిడిగా భద్రపరిచినట్లు గుర్తించారు.మాంసాన్ని శుభ్రం చేసి,సరిగ్గా ప్యాక్ చేసి స్టోర్ చేయడంతో పాటు ఇక్కడ 'ఫోస్టాక్'సర్టిఫైడ్ ఫుడ్ సేఫ్టీ సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.అయితే తనిఖీల సమయంలో కొన్ని ఆహార పదార్థాలపై మూతలు పెట్టకపోడాన్ని గమనించిన అధికారులు మూతలు మూసి ఉంచాలని,వాడుతున్న నెయ్యి ప్యాకెట్లపై సరైన లేబులింగ్ లేకపోవడంతో లేబుల్స్ కలిగిన ఉత్పత్తులనే వాడాలని అధికారులు సూచించారు.7 సిస్టర్స్ రెస్టారెంట్‌కు నోటీసులు..హైటెక్ సిటీ ఎన్ఏసీ బిల్డింగ్ దగ్గర ఉన్న 7 సిస్టర్స్ రెస్టారెంట్ లో తనిఖీలు నిర్వహించిన అధికారులుఈ రెస్టారెంట్‌కు హైజీన్ అసెస్‌మెంట్‌లో కేవలం 73 శాతం మార్కులు మాత్రమే ఇచ్చారు.వండిన ఆహార పదార్థాలను నిర్దేశిత గడువు లోపు పారేయకుండా అలాగే దాచి ఉంచారని,డ్రైనేజీ ప్రాంతాల సమీపంలో ఆహార పదార్థాలను సరైన మూతలు లేకుండా తెరిచి ఉంచినట్లు పేర్కొన్నారు.స్టోర్ రూమ్‌లో బల్లి విసర్జితాలు లభ్యమయ్యాయని అక్కడ క్లీనింగ్ సరిగ్గా లేదని తేలింది.కిచెన్ ఫ్లోరింగ్ దెబ్బతిని,టైల్స్ పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని మాంసం పదార్థాలకు సరైన లేబులింగ్ లేదు,అలాగే హాట్ వాటర్ శానిటైజేషన్ పద్ధతులను పాటించడం లేదని గుర్తించారు.ఈ లోపాలపై తీవ్రంగా స్పందించిన ఫుడ్ సేఫ్టీ బృందం సదరు రెస్టారెంట్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసింది.ఆహార నిల్వ,లేబులింగ్,పరిశుభ్రత,హౌస్ కీపింగ్ పద్ధతులను తక్షణమే మెరుగుపరుచుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించింది.

## సర్ పేరుతో ఓట్లు తొలగింపు సరికాదు : బచ్చు విజయ్ కుమార్



**ఖమ్మం, నేటి శుభోదయ :** సర్ పేరుతో ఓట్లు తొలగింపు సరికాదు అని బిఆర్ ఎస్ జిల్లా నాయకు లు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ పే ర్కొన్నారు. ఆదివారం ఖానా పురం హవేలీ 2,3,4,5,6, 7,8, 14,15 డివిజన్లలో సర్ గురించి బిఎల్ఏలకు, డివిజన్ ముఖ్య నాయకులకు, అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బిఆర్ ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బచ్చు విజయ్ కుమార్, నాగండ్ల కోటేశ్వర రావు, వలరాజు పాల్గొన్నారు.

## బోనకల్ జూనియర్ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు







**బోనకల్, నేటి శుభోదయ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి నళిని శ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యోగ గురువు ఆత్మకూరు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని అధిగమించి జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి సాధనలు తప్పనిసరి అని అన్నారు. యోగ సాధన వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు.ప్రాణాయామాలు, ధ్యానం, ఒత్తిడి నిర్వహణ, కెరీర్ అభివృద్ధి, ఆరోగ్యకరమైన జీవనశైలి వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగ సాధనకు సమయం కేటాయించాలని సూచించా రు. అనంతరం పలు యోగాసనాలు, ప్రాణాయా మ విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి విద్యార్థులతో సాధన చేయించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుని, ప్రతిరోజూ యోగాసనాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని సంకల్పించారు. కార్యక్రమం అనంతరం యోగ గురువు నాగేశ్వరరావును కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంతోటి తిరుపతి రావు, జొనాతన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియకుమార్ రెడ్డి, మురళీకృష్ణ, శాంతిప్రియ, యూడీసీ మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ వద్దిరాజు-విజయలక్ష్మీ దంపతుల పెళ్లి రోజు వేడుకలు

### - కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసిన రవిచంద్ర-విజయలక్ష్మీ



**హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ :** పుణ్య దంపతులు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మీలు తమ పెళ్లి రోజు సందర్భంగా ఆదివారం వేడుకలు జరిగాయి. రవిచంద్ర-విజయలక్ష్మీల పెళ్లి రోజు సందర్భంగా కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, కుమారుడు-కోడలు నిఖిల్ చంద్ర-అనీలలు వారి చేత ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని నివాసంలో కేక్ కట్ చేయించి హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.ఈ సందర్భంగా రవిచంద్ర చెల్లెలు శీలం లక్ష్మీ, సన్నిహితులు మోహన్ యశ్వంత్ పాటిల్,సుమిత అరుణ్ సింగ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డిలు పుణ్య దంపతులకు హృదయపూర్వక పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.రవిచంద్ర తన పెళ్లి రోజు సందర్భంగా ఆదివారం ఉదయం జూబ్లీహిల్స్ లోని శ్రీవెంకటేశ్వర స్వామి (తిరుమల-తిరుపతి దేవస్థానం) ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకుని తన గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు.ఆలయానికి విచ్చేసిన ఎంపీ రవిచంద్రకు వేద పండితులు సాదర స్వాగతం చెబుతూ శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు పలికారు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు బహుకరించారు. అలాగే,ఎంపీ రవిచంద్ర తనకు చదువు చెప్పిన గురువు ఒద్దిరాజు దశరథ రామయ్య ఆశీస్సులు అందుకున్నారు.పార్లమెంట్ సభ్యులు సుభాష్ కుంతియ (ఒడిషా) రవిచంద్రను శాలువాతో సత్కరించి హృదయపూర్వక పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ కుంతియ,తన గురువు దశరథ రామయ్యలను ఎంపీ రవిచంద్ర శాలువాలు కప్పి సన్మానించారు. ఖమ్మం జిల్లా సువర్ణపురం సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య, సన్నిహితులు చెరుకూరి శేషగిరిరావు-హైమావతి, సందీప్ తదితరులు ఎంపీ రవిచంద్ర పెళ్లి రోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ నవీన్ ఎంపీ రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పెళ్లి రోజు శుభాకాంక్షలు చెప్పారు.మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం,టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, సన్నిహితులు ఎర్రా నాగేంద్రబాబు, ఆకుల రజిత్,దుర్గం రవీందర్,ఊసా రఘు, ఆవుల రామారావు,జేన్నాయికోడే జగన్మోహన్, ఖమ్మంకు చెందిన వ్యాపారవేత్త ఖాజా తదితరులు ఎంపీ రవిచంద్రను కలిసి పుష్పగుచ్ఛమిచ్చి పెళ్లి రోజు శుభాకాంక్షలు చెప్పారు.అలాగే, ఎంపీ రవిచంద్రను ఆయన చిరకాల అభిమాని, ఖమ్మం వెంకటగిరి వాస్తవ్యులు జిల్లపల్లి ఉపేందర్ పుష్పగుచ్ఛమిచ్చి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు,కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేటర్, వీరాభిమాని గోవాడ గుణచరిత్ రవిచంద్రను కలిసి మిఠాయి పెళ్లి రోజు శుభాకాంక్షలు చెప్పారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**ఖమ్మం, నేటి శుభోదయ :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తనికెళ్ళ మండలం నందు ఖమ్మం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఘనంగా యోగ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్స్ రజిని, మేరా యువ భారత్, జిల్లా యువజన అధికారి ఎం. వెంకట్ రాంబాబు, కే. భానుచందర్, జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సయ్యద్ షారుక్ ఇమ్రాన్వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని సరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదన చేశారనీ, ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారనీ, యోగా అనేది మానవులకు మంచే కలుగజేస్తుందని, యోగ ప్రతిరోజు చేయడం వలన జీర్ణ వ్యవస్థ రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుందని సకల రోగాలకు బెడ్ పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ యోగా మాస్టర్ పి. సంధ్య శరీర, మానసిక ఆరోగ్యానికి యోగాసనాలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి, కండరాలను దృఢపరుస్తాయి. తడాసనం, వజ్రాసనం, భుజంగాసనం, విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించడం జరిగింది. ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి మనస్సుకు ప్రశాంతతను ఇస్తుంది అని అన్నారు. కొంతమంది విద్యార్థులు వ్యాస రచన పోటీలలో పాల్గొనగా అందులో మొదటి, ద్వితీయ బహుమతులు అందజేయడం జరిగింది. పి.ఇ.టి, రమ్య అనంతరం విద్యార్థులతో యోగ ఆసనం లోగో ప్రదర్శించడం జరిగింది. కార్యక్రమానికి సహకరించిన ప్రిన్సిపాల్ కి మేరా యువ భారత్ మరియు జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు.

## అల్లాదుర్గం సీనియర్ జర్నలిస్ట్ భూమయ్యను పరామర్శించిన మంత్రి దామోదర్ రాజ నర్సింహ



**సంగారెడ్డి, నేటి శుభోదయ :** మెదక్ జిల్లా,అల్లాదుర్గం మండల వార్త దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(TUWJ) మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కే. భూమయ్య గత కొద్ది రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కు గురై హైద్రాబాద్ లోని బోయిన్ పల్లిలో హెకా రిహబ్ హాస్పిటల్ లో చేరారు. ఈసమాచారం తెలుసుకున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహా ఆదివారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని భూమయ్యను పరామర్శించి ఆయనకు మనోధైర్యాన్ని కల్పించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.ప్రతిరోజు నివేదిక ఇవ్వాలన్నారు.ధైర్యం కోల్పోవద్దని అన్నివిధాలుగా తాను అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.ఆయన వెంట మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజె అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి,ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# జూన్ 25న 'హనుమాన్' 3D విజువల్ వండర్.. మళ్లీ పూనకాలే!



సూపర్ హీరో తేజ సజ్జ, క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో ఈ ఏడాది విడుదలై సంచలన విజయం సాధించిన చిత్రం 'హనుమాన్'. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్, ఇప్పుడు సరికొత్త 3డి అనుభూతిని పంచేందుకు సిద్ధమైంది. జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా 3డిలో విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర బృందం హైదరాబాద్‌లో 3డి ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ, "హనుమాన్ 3డి ట్రైలర్ అద్భుతంగా ఉంది. తెలుగు ప్రేక్షకులకు కొత్త టెక్నాలజీతో మంచి సినిమా అందించాలనే నిర్మాతలు నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డిల ప్యాషన్‌ను అభినందిస్తున్నాను. ఈ సినిమాలో చివరి 20 నిమిషాలు నాకు మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. హనుమంతుడిని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతుంది. జూన్ 25న అందరూ కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి ఈ అద్భుతమైన అనుభూతిని పొందండి" అని కోరారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ, "నేను కూడా మీతో పాటే మొదటిసారి 3డి ట్రైలర్ చూశాను. చాలా అద్భుతంగా ఉంది. ఈ సినిమా కోసం నిర్మాతలు పడిన కష్టం తెరపై కనిపిస్తోంది. మీ అందరిలాగే నేను కూడా 3డిలో సినిమాను మళ్లీ థియేటర్లలో చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఎంతో పుణ్యం చేసుకుంటే గానీ ఇలాంటి సినిమాలో నటించే అవకాశం రాదు. ప్రేక్షకులు చూపించిన ప్రేమాభిమానాలకు నా కృతజ్ఞతలు" అని అన్నారు. ఈ టీమ్‌ను మళ్లీ కలవడం ఒక రీయూనియన్‌లా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, "2డిలో 'హనుమాన్' చిత్రాన్ని ఆదరించినట్లే, 3డిలో కూడా ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాను" అని తెలిపారు. మరో నిర్మాత చైతన్య రెడ్డి, "ప్రేక్షకుల ఆదరణకు ప్రతిగా ఏదైనా ఇవ్వాలనే ఆలోచనతోనే ఈ సినిమాను 3డిలోకి మార్చాం. అత్యాధునిక టెక్నాలజీతో సిద్ధం చేసిన ఈ వెర్షన్ గొప్ప అనుభూతినిస్తుంది" అని వివరించారు. దాదాపు 600 మంది టెక్నీషియన్లు మూడు నెలల పాటు శ్రమించి 3డి వెర్షన్‌ను సిద్ధం చేశారని 3డి కిరణ్ తెలిపారు. హీరోయిన్ అమృత అయ్యర్, సంగీత దర్శకుడు గౌర హరి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, 3డిలో సినిమా చూడటం ఒక గొప్ప అనుభవంగా ఉంటుందని, జూన్ 25 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు...

# రావిపూడి రక్తంతో విజయ తిలకం..

## వెంకటేష్, కళ్యాణ్ రామ్ క్రేజీ వీడియో వైరల్ !

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ , కళ్యాణ్ రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. #VenkyAnil5 #NKRAR2 వర్కింగ్ టైటిల్స్ తో పిలుచుకుంటున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీ షూటింగ్ పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. తాజా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ, చిత్ర బృందం సోషల్ మీడియాలో ఓ ఫన్నీ వీడియోని షేర్ చేసింది. సినిమాలకు ప్రమోషన్స్ చేయడంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి స్టైలే వేరు. అనౌన్స్ మెంట్ దగ్గర నుంచి, థియేటర్లలో బొమ్మ పడే వరకూ రకరకాల ప్రమోషనల్ స్ట్రాటజీలతో అందరూ తన సినిమా గురించి మాట్లాడుకునేలా చేస్తుంటారు. 'వెంకీ - కళ్యాణ్ రామ్' మూవీ విషయంలోనూ తనదైన శైలిలో పబ్లిసిటీ చేస్తున్నారు. రీసెంట్ గా మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్, గేయ రచయిత అనంత్ శ్రీరామ్‌లను ఇసుకలో పాతిపెట్టిన రావిపూడి.. ఇప్పుడు ఓ కత్తిలాంటి ప్రమోషనల్ ఐడియాతో వచ్చారు. ''రావిపూడి రక్తంతో విజయ తిలకం దిద్దిన టీం'' అంటూ ఓ వీడియోని రిలీజ్ చేశారు. ఇందులో జీవి ప్రకాష్ కుమార్ ను ఇసుకలో పాతిపెట్టడం గురించి ఆవేదన వ్యక్తం చేసిన వెంకటేష్.. అనిల్ ను చూస్తే వణుకు వచ్చేస్తుందని సరదాగా అంటారు. 'పటాస్' సినిమా చేసినప్పుడు బాగానే ఉన్నాడని, కానీ వెంకీ గారాబం వల్లే ఇలా తయారయ్యాడని, 'నేను పాడతా' అనే దగ్గర నుంచి ఈయన్ని పాతేసే దాకా తీసుకొచ్చారని కళ్యాణ్ రామ్ అన్నారు. అప్పుడే అనిల్ రావిపూడి తలపాగా పెట్టుకొని, ఓ పెద్ద కత్తి పట్టుకొని ఎంట్రీ ఇచ్చారు. కత్తిలాంటి ప్రమోషన్స్ చేస్తున్నారని, ఫ్యాన్స్ తన చేతిలో కత్తి పెట్టి 'కాన్సెప్ట్ కింగ్' అనే బిరుదు ఇచ్చారని దర్శకుడు తెలిపారు. ఎప్పుడూ తానే ఐడియాలు ఇస్తానని, ఈసారి టీమ్ ఏదైనా ఐడియా ఇవ్వాలని అనిల్ రావిపూడి అడుగుతారు. అప్పుడు కత్తిలాంటి ఐడియా ఇస్తానని చెప్పిన వెంకటేష్.. ఆ కత్తి తీసుకొని అనిల్ రావిపూడి వేలు కోసి మరీ ఆయనకే వీర తిలకం దిద్దుతారు. "అబ్బబ్బా.. రావిపూడి రక్తంతో విజయ తిలకం దిద్దిన వెంకటేష్ గారూ" అంటూ పక్కనే ఉన్న మరో హీరో కళ్యాణ్ రామ్ కూడా అనిల్ చేయి కోసి తిలకం దిద్దుతారు. కీర్తి సురేష్, కృతిశెట్టిలు కూడా ఇదే పని చేయడంతో.. ఇదంతా చూస్తున్న జీవి ప్రకాష్ కుమార్ ముసిముసి నవ్వులు నవ్వుతారు. తనకు బ్రేక్ ఫాస్ట్ వద్దని, కడుపు నిండిపోయిందంటూ అనిల్ రావిపూడి వేలు మీద గుండు సూదితో గుచ్చుతాడు.




# ఓజీ 2' స్టోరీ రెడీ..

## పవన్ కల్యాణ్‌కు సుజీత్ నరేషన్!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సీక్వెల్‌పై కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఓజీ2 కోసం ప్రీ-ప్రొడక్షన్ చర్చలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. దర్శకుడు సుజీత్... పవన్ కు ఓజీ2 కథ వినిపించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేసింది. ఇచ్చిన మాట ప్రకారం చర్చలు మొదలయ్యాయని, దర్శకుడు సుజీత్ ... పవన్ తో సమావేశంలో పాల్గొన్నారని వెల్లడించింది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ క్రైమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'దే కాల్ హిమ్ ఓజీ' (2025) చిత్రంపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విజన్ తనకు ఎంతగానో నచ్చిందని, దీనిని ఒక యూనివర్స్‌గా (సీక్వెల్స్, ప్రీక్వెల్స్) విస్తరించే ఆలోచన ఉందని పవన్ కల్యాణ్ గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతుండటంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్రియేటివ్ వర్క్స్ కార్యాలయంలో దర్శకుడు సుజీత్, పవన్ మధ్య చర్చలు జరగడం ఓజీ2 ప్రాజెక్ట్‌పై కదలిక మొదలైందనడానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ వార్త తెలియగానే పవన్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. ఓజీ2 హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు, మీమ్స్ ట్రెండ్ అవుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం..

## శ్రీలంకపై భారత్ 'ఏ' భారీ స్కోరు!




శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు 'ఏ' సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో భారత యువ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. ముఖ్యంగా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్‌తో శ్రీలంక 'ఏ' బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడి మెరుపులకు తోడు కెప్టెన్ తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), అనుకూల్ రాయ్ (39) కీలక ఇన్నింగ్స్‌లు ఆడటంతో భారత 'ఏ' జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న ఈ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక 'ఏ' జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (39)తో కలిసి వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. ముఖ్యంగా సూర్యవంశీ క్రీజులోకి వచ్చినప్పటి నుంచే బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం పూర్తిచేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. అతడి ధాటికి భారత స్కోరుబోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. కేవలం 8.5 ఓవర్లకే భారత్ 132 పరుగులు చేసిందంటే సూర్యవంశీ ఏ స్థాయిలో చెలరేగాడో అర్థం చేసుకోవచ్చు. శతకం ఖాయం అనుకున్న దశలో, అతను 94 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యాడు. సూర్యవంశీ సృష్టించిన బలమైన పునాదిపై మిగతా బ్యాటర్లు రాణించారు. మరో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కూడా వేగంగా ఆడి ఔటయ్యాక, రుతురాజ్ గైక్వాడ్, కెప్టెన్ తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. గైక్వాడ్ నెమ్మదిగా ఆడినా, తిలక్ వర్మ బాధ్యతాయుతమైన అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. ఆ తర్వాత కుమార్ కుశాగ్ర (36) వేగంగా ఆడాడు. చివర్లో, ఆల్‌రౌండర్ అనుకూల్ రాయ్ కేవలం 15 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసి స్కోరును 370 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. ఒక దశలో 400 పరుగులు దాటేలా కనిపించినా, చివర్లో వరుసగా వికెట్లు కోల్పోవడంతో భారత్ 377 పరుగులకు పరిమితమైంది. శ్రీలంక బౌలర్లలో రవిందు ఫెర్నాండో, వనుజ సహన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. వనుజ సహన్ (2/39), విజయకాంత్ వయస్కాంత్ (0/36) మినహా మిగతా బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన టీజీ20 లీగ్...

## హాజరైన విజయ్ దేవరకొండ

తెలంగాణ క్రీడారంగంలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీజీ20 (టీజీ20) లీగ్ ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవ వేడుక అంబరాన్నంటింది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఈ లీగ్ అట్టహాసంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా లీగ్ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ తన లైవ్ పర్ఫార్మెన్స్‌తో స్టేడియాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... హైదరాబాద్, తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆటగాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారని, వీవీఎస్ లక్ష్మణ్ తర్వాత ఆ స్థాయి ఖాళీ ఏర్పడిందని అన్నారు. ఈ టీజీ20 లీగ్ ద్వారా ఎంతో మంది యువ ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చి, ఐపీఎల్, టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ లీగ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఛాంపియన్స్ (ఈటీవీ భారత్) సహా పలు జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవం అనంతరం లీగ్‌లో మ్యాచ్‌లు కూడా మొదలయ్యాయి. తెలంగాణలోని యువ క్రీడాకారులకు ఇదొక సువర్ణావకాశమని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, ఈ లీగ్ నిర్వహణపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) నుంచి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ, హెచ్‌సీఏ మాత్రం ఈ టోర్నీని విజయవంతంగా ముందుకు నడిపిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీజీ20 లీగ్‌కు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉండి, అవకాశాలు రాని యువతకు ఇది ఒక గొప్ప వేదిక అని ఆయన ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని భట్టి వివరించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి, వారిని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620